# విశాల భారతి

తెలుగు దినపత్రిక

23-01-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్

సంపుటి:4 సంచిక: 22




## నైనీ బొగ్గు గనుల టెండర్ రద్దు

నైనీ బొగ్గు గని వ్యవహారం సంచలనంగా మారింది
టెండర్లను రద్దు చేయడంతో రాజకీయ ప్రకంపనలు
దీంతో ఈ వ్యవహారంలోకి కేంద్రం రంగంలోకి దిగింది
పాలనాపరమైన కారణాల వల్లే టెండర్లు రద్దు చేశామని వెల్లడి
కొన్ని సంస్థలు అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నట్లు సమాచారం

02

## ఫ్యూచర్ సిటీకి ఏఐ కళ

- రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి
- ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది
- వోల్ట్ సంస్థతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి
- 100 మెగావాట్లతో అత్యంత శక్తివంతమైన ఏఐ డేటా సెంటర్
- 800 మంది ఐటీ నిపుణులకు అత్యున్నత స్థాయి ఉద్యోగాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే కృత్రిమ మేధస్సు, డేటా సెంటర్ల రాజధానిగా మార్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అద్భుతమైన ప్రగతిని సాధిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుని పారిశ్రామిక రంగంలో కొత్త ప్రకంపనలు సృష్టించింది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన యూపీసీ రిన్యూవబుల్స్ , వోల్ట్ డేటా సెంటర్స్ భాగస్వామ్యంలో ఏర్పడిన యూపీసీ వోల్ట్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ ఒప్పందం ద్వారా అటు సాంకేతిక రంగం ఇటు పర్యావరణ పరిరక్షణ రంగాల్లో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కనుంది. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ ప్రాజెక్టు కొలువుదీరనుంది. సుమారు 100 మెగావాట్ల సామర్థ్యంతో అత్యంత శక్తివంతమైన ఏఐ అనుకూల డేటా సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నారు. దీనికోసం యూపీసీ వోల్ట్ సంస్థ రాబోయే ఐదేళ్లలో సుమారు ఐదు వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడిని మన రాష్ట్రానికి తీసుకురావడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సంస్థ ప్రతినిధులతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించడం వల్లనే ఈ భారీ పెట్టుబడి సాధ్యమైంది. దీని వల్ల తెలంగాణ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోబోతోంది. ఈ మెగా ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ఉపాధి రంగానికి పెను మార్పులు తీసుకురాబోతోంది. కేవలం నిర్మాణ దశలోనే సుమారు మూడు వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తయి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత దాదాపు 800 మంది ఐటీ నిపుణులకు అత్యున్నత స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. నైపుణ్యం కలిగిన యువతకు స్థానికంగానే అంతర్జాతీయ స్థాయి కంపెనీలో పనిచేసే అవకాశం కలగడం ప్రభుత్వ ముందుచూపుకు నిదర్శనం. యువత కలలకు రెక్కలు తొడుగుతూ ఈ డేటా సెంటర్ ఒక ఉపాధి గనిగా

మిగతా 3లో..



తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ ఉదంతం ఒక పెను తుపానులా విరుచుకుపడుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా భావిస్తున్న ఈ వ్యవహారం ఇప్పుడు కేవలం పోలీసు అధికారులకే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అత్యున్నత రాజకీయ నాయకత్వం చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. దర్యాప్తు సంస్థ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించినట్లు వార్తలు వస్తుండటంతో, తదుపరి అడుగు ఎటువైపు పడుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ కేసు విచారణలో వెలుగు చూస్తున్న అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ అగ్రనేతలు ఈ కేసులో బాధ్యులుగా తేలితే, అది ఆ పార్టీ మనుగడపైనే ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# గులాబీ బాస్ గుండెల్లో గుబులు

## ఫోన్ ట్యాపింగ్ ఉదంతం పెను తుపానులా మారింది

అత్యున్నత రాజకీయ నాయకత్వం చుట్టూ ఉచ్చు బిగిస్తోంది
బీఆర్ఎస్ అగ్రనేతలు ఈ కేసులో బాధ్యులుగా తేలే అవకాశం
మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది
మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు అందే అవకాశం ఉందన్న ప్రచారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం సిట్ విచారణ కేవలం ఒక కోణంలోనే కాకుండా, బహుముఖాలుగా సాగుతోంది. రాజకీయ ప్రత్యర్థుల కదలికలపై నిఘా పెట్టడం నుంచి మొదలై, వ్యాపారవేత్తలను బెదిరించడం, నిధుల మళ్లింపు వంటి అనేక తీవ్రమైన ఆరోపణలు ఈ కేసులో ముడిపడి ఉన్నాయి. ఇప్పటికే జైలులో ఉన్న ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు ఇస్తున్న వాంగ్మూలాలు ఈ కేసులో మలుపులు తిప్పుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ రెడ్డి సర్కార్, ఎక్కడా వెనక్కి తగ్గకుండా విచారణను వేగవంతం చేస్తోంది. దీంతో ఇటు రాజకీయ వర్గాల్లోనూ, అటు అధికార యంత్రాంగంలోనూ ఒక రకమైన అభద్రతా భావం కనిపిస్తోంది. ఇటీవల మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ అధికారులు విచారించడం తెలంగాణ

మిగతా 3లో..



## గ్రూప్ 1 మెయిన్స్‌పై ఊహించని ట్విస్ట్

- గ్రూప్-1 కొలువుల భవిష్యత్తు మరోసారి సందిగ్ధంలో పడింది
- అభ్యర్థులు వెలువడే తుది తీర్పు కోసం ఎదురుచూపులు
- తాజా అప్‌డేట్ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది
- తీర్పు కాపీ ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని వెల్లడించింది
- ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల కలల సౌధం లాంటి గ్రూప్-1 కొలువుల భవిష్యత్తు మరోసారి సందిగ్ధంలో పడింది. ఏళ్ల తరబడి కష్టపడి, ఎన్నో అడ్డంకులను అధిగమించి మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థులు వెలువడే తుది తీర్పు కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. అయితే న్యాయస్థానం నుంచి వచ్చిన తాజా అప్‌డేట్ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ కేసును విచారించినప్పటికీ, తీర్పును వెల్లడించకుండా ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేయడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ పరిణామం అటు ఉద్యోగాలు పొందిన వారిలోనూ, ఇటు న్యాయం కోసం

మిగతా 3లో..

## సింగరేణిని ముంచేశారు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా సమావేశం

సింగరేణి కాలరీస్ సంస్థపై సంచలన వ్యాఖ్యలు
బీఆర్ఎస్ సింగరేణిని నిర్వీర్యం చేసిందని ఆరోపణ
అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆయన విమర్శించారు
సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని ఆరోపించారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సింగరేణి కాలరీస్ సంస్థపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గత భారత్ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఒకప్పుడు లాభాల్లో ఉన్న ఈ సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని తన సొంత అవసరాల కోసం వాడుకుంటూ దాని స్వయంప్రతిపత్తిని దెబ్బతీసిందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సింగరేణి బోర్డు అనేది గత ప్రభుత్వ హయాంలో కేవలం ఒక నామమాత్రపు విభాగంగా మిగిలిపోయిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కీలకమైన నిర్ణయాలన్నీ

మిగతా 2లో..

## కొత్త జిల్లాలపై కీలక ప్రకటన

- కొత్త జిల్లాల రద్దు వ్యవహారంపై భట్టి విక్రమార్క స్పష్టమైన ప్రకటన
- జిల్లాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడం లేదని వెల్లడించారు
- జిల్లాల సంఖ్యను తగ్గించే ఆలోచనే లేదని స్పష్టం చేశారు
- తప్పుడు కథనాలను సృష్టిస్తున్నాయని మండిపడ్డారు
- సింగరేణిపై వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో గత కొద్దిరోజులుగా కలకలం రేపుతున్న కొత్త జిల్లాల రద్దు వ్యవహారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎట్టకేలకు ఒక స్పష్టమైన ప్రకటన చేస్తూ ఈ వివాదానికి పూర్తిగా తెరదించారు. పరిపాలనా సౌలభ్యం కోసం గతంలో ఏర్పాటు చేసిన జిల్లాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయబోతోందంటూ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన తేల్చి చెప్పారు. అసలు ప్రభుత్వం వద్ద జిల్లాల సంఖ్యను తగ్గించే ఆలోచనే లేదని, ఇలాంటి అసత్య వార్తలను నమ్మి ప్రజలు కానీ, ప్రభుత్వ ఉద్యోగులు కానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అత్యంత ధీమాగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల్లో నెలకొన్న సందిగ్ధతను తొలగించే ఉద్దేశంతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కొన్ని రాజకీయ శక్తులు కావాలనే ప్రజలను అయోమయానికి గురిచేయడానికి

మిగతా 2లో..

## 'ప్రశ్నిస్తూనే ఉంటాం'

కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది

రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది
హరీశ్ రావు ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు
ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కుట్రలు చేస్తోందన్నారు
ఒక పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతుందని విమర్శించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ కావడం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అత్యంత ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. రేవంత్ రెడ్డి పాలన తీరును ఒక సైబర్ నేరగాడి ప్రవర్తనతో పోల్చిన హరీశ్ రావు,

మిగతా 3లో..





# ఈరోజు కేటీఆర్ వంతు!

## ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక మలుపు

కేటీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసులు జారీ
ఉదయం 11 గంటలకు హాజరు కావాలనిఆదేశించింది
అధికారులు 2024 మార్చి నుంచి దర్యాప్తు చేస్తున్నారు
ఈ నెల 20న హరీశ్ రావును అధికారులు విచారించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కేటీఆర్ లాంటి అగ్రనేతకు నోటీసులు అందడంతో ఈ కేసులో తదుపరి ఏం జరగబోతుందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సిట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయనను అధికారులు ప్రశ్నించే అవకాశం కనిపిస్తోంది. ఈ నోటీసుల అంశం సోషల్ మీడియాలోనూ, రాజకీయ వర్గాల్లోనూ విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రభుత్వం కావాలనే కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికార పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

మిగతా 2లో..

**తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసు విచారణలో భాగంగా సిట్ అధికారులు తమ దూకుడును పెంచారు. తాజాగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక్కసారిగా కలకలం రేపింది.**

# కొత్త జిల్లాలపై కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి**

ఇటువంటి తప్పుడు కథనాలను సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు పౌరుల్లో అనవసర భయాందోళనలు రేకెత్తించడమే లక్ష్యంగా ఈ గందరగోళం సృష్టించబడుతోందని ఆయన విమర్శించారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, ఆ లక్ష్యానికి విరుద్ధంగా జిల్లాలను ఎత్తివేసే ప్రసక్తే ఉండదని ఆయన పదే పదే నొక్కి వక్కాణించారు.

కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల ఆర్థిక భారం పెరుగుతోందని, అందుకే ప్రభుత్వం పునరాలోచనలో పడిందంటూ వస్తున్న విశ్లేషణలను కూడా ఆయన తోసిపుచ్చారు. పరిపాలనా ఖర్చులు పెరిగినప్పటికీ ప్రజల సౌకర్యం, అభివృద్ధి ప్రాధాన్యతలే తమకు ముఖ్యమని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న వివిధ శాఖల సమీక్షలను, ఖర్చుల నియంత్రణ చర్యలను జిల్లాల రద్దుతో ముడిపెట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకే తాము ప్రయత్నిస్తున్నామని, దానికి జిల్లాల రద్దుకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఇదే సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి సింగరేణి సంస్థ గురించి కూడా భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలు దోచుకుంటున్నాయనే ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సంస్థ ఆస్తులు యావత్ తెలంగాణ ప్రజల సంపద అని, వాటిని కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్ని కూడా తాము సహించబోమని, సంస్థను మరింత లాభాల బాటలో



నడిపించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

సింగరేణి సంస్థకు సంబంధించి గతంలో జరిగిన కొన్ని నిర్ణయాలు, ప్రస్తుత పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దీనిపై ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసేందుకు రేపటి రోజున ఒక సమగ్రమైన ప్రకటన చేస్తానని ఆయన వెగ్గడించారు. ఈ సంస్థపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేలా అన్ని వాస్తవాలను గణాంకాలతో సహా బయట పెడతామని ఆయన తెలిపారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం లోతుగా చర్చించి, కేవలం ప్రజా సంక్షేమమే పరమావధిగా ఉంటుందని ఆయన మరోసారి ప్రజలకు హామీ ఇచ్చారు. తెలంగాణ సమాజంలో ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రియల్ ఎస్టేట్ రంగంపై ఈ రద్దు వార్తలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. జిల్లాల రద్దు వార్తలతో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో స్థలాల ధరలు పడిపోవడం, పెట్టుబడులు వెనక్కి తగ్గడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని నిఘా వర్గాలు కూడా హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం రంగంలోకి దిగి ప్రభుత్వం తరపున అధికారిక వివరణ ఇచ్చారు. దీనివల్ల గత కొద్ది రోజులుగా జిల్లా కేంద్రాల్లో నెలకొన్న అనిశ్చితి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి అంతా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిపాలనను మరింత వేగవంతం చేయడంపైనే ఉందని భట్టి వివరించారు. చిన్న జిల్లాలు ఉండటం వల్ల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అధికార వికేంద్రీకరణ ఫలితాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే జిల్లాల వ్యవస్థ బలంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఈ వ్యవస్థను పటిష్టం చేయాలే తప్ప బలహీనపరిచే చర్యలు ఏవీ చేపట్టమని ఆయన కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు. రాజకీయంగా విమర్శలు చేసేవారు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప, ఇటువంటి గందరగోళ ప్రచారాలకు ఊతమివ్వకూడదని భట్టి విక్రమార్క హితవు పలికారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను నిజమని నమ్మవద్దని, ఏదైనా మార్పు ఉంటే ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని ఆయన చెప్పారు. వాట్సాప్ వంటి వేదికల్లో వైరల్ అవుతున్న వార్తలకు ఎటువంటి ప్రాతిపదిక లేదని, అవి కేవలం ఊహాగానాలు మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వాస్తవాలను గ్రహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న బదిలీల భయాలు, సీనియారిటీ సమస్యలపై కూడా ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. జిల్లాల రద్దు ఆలోచనే లేనప్పుడు ఉద్యోగుల సర్దుబాటు లేదా ఇతర ఇబ్బందుల ప్రసక్తే తలెత్తదని భట్టి విక్రమార్క మాటల సారాంశం. ప్రభుత్వం ప్రస్తుతం ఉద్యోగుల సంక్షేమం, పాలనా సంస్కరణలపై దృష్టి పెట్టిందని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల లబ్ధి పొందుతున్న సామాన్య ప్రజలకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

## అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మ నిస్తుంది




**పాల్వంచ విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎ),పాల్వంచ జాతీయ సేవ విభాగం యూనిట్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలంలోని కేశవపురం గ్రామం లో ది 19012026 నుండి 25012026 వరకు ఎన్ ఎస్ ఎస్ శీతకాల శిబిరం కొనసాగుతున్న నాల్గవ రోజు కార్యక్రమాలలో భాగంగా ప్రిన్సిపాల్ ప్రొ. పి. పద్మ అధ్యక్షుతన రోడ్డు భద్రత మరియు ప్రమాదాల నివారణ పై ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి విచ్చేసిన శ్రీ సంగం. వెంకట పుల్లయ్య , మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మ నిస్తుందని వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదం జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాద భాదితులను రక్షించుటకు ప్రవేశ పెట్టిన నిబంధనలు ద్వారా రక్షించి, 25 వేల రూపాయలు బహుమతి పొందవచ్చునని తెలియజేసారు. ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ గా మీరు సేవ భావంతో చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని అభినందించారు.ఈ కార్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రొ. పి. పద్మ, ఎన్ ఎస్ ఎస్ డిస్ట్రిక్ట్ కన్వీనర్ డాక్టర్. వేముల. కామేశ్వరరావు, కళాశాల రోడ్డు సేఫ్టీ కన్వీనర్ కోటగిరి రాంబాబు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం క్యాంపు ఇంచార్జ్ లు . భాను ప్రవీణ్, .ధర్మారావు,. రమేష్, మరియు శ్రీను లెక్చరర్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# సింగరేణిని ముంచేశారు

**మొదటిపేజీ తరువాయి**

ప్రగతి భవన్ నుండే వెలువడేవని, బోర్డుకు ఎటువంటి ప్రాధాన్యత ఉండేది కాదని ఆయన విమర్శించారు. టెండర్ల కేటాయింపు నుంచి కాంట్రాక్టుల వరకు ప్రతి అంశంలోనూ కేసీఆర్ కుటుంబం జోక్యం ఉండేదని ఆయన ఘాటుగా విమర్శించారు. దీనివల్ల సంస్థలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, అర్హులైన వారికి కాకుండా తమకు నచ్చిన వారికి పనులు కట్టబెట్టారని ఆయన అన్నారు. సింగరేణి సంస్థకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను కూడా గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాల్సిన నిధులను రాజకీయ ప్రయోజనాల కోసం మళ్లించారని ఆయన ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం వాడాల్సిన సొమ్మును ఇతర అవసరాలకు వినియోగించడం వల్ల సింగరేణి ప్రాంతాల అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా పనులు కేటాయించి సంస్థకు ఆర్థికంగా భారీ నష్టాన్ని కలిగించారని ఆయన వివరించారు. సింగరేణి ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగించుకున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు సకాలంలో డబ్బులు చెల్లించలేదని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుండే భారీగా బకాయిలు రావాల్సి ఉన్నా, గత ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఈ బకాయిల వల్ల సింగరేణి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, కనీసం రోజువారీ కార్యకలాపాలకు కూడా ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బాధ్యతను విస్మరించి సంస్థను కష్టాల్లోకి నెట్టిందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ అనవసరంగా జోక్యం చేసుకోలేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కేంద్రం మీద నెట్టేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. బోర్డు సమావేశాల్లో ఏం జరుగుతుందో కనీసం తనకు కూడా సమాచారం అందకుండా చేశారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన వాటా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని ఆయన ఆరోపించారు. నిబంధనల ప్రకారం జరగాల్సిన పాలనను పక్కన పెట్టేసి ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆయన



విమర్శించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద జిల్లాలకు అందాల్సిన రూ.1500 కోట్ల నిధులు కూడా నిధుల లేమి కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నిధులు మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి చాలా కీలకమైనవి. కానీ గత ప్రభుత్వ ఆర్థిక అరాచకాల వల్ల ఈ నిధులు కూడా విడుదల కాలేదని ఆయన అన్నారు. దీనివల్ల సింగరేణి పరిసర ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాల కల్పన కూడా ఆగిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందాల్సిన ఫలాలను గత ప్రభుత్వం అడ్డుకుందని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లలో సింగరేణి అప్పులు అనూహ్యంగా పెరిగిపోయాయని కిషన్ రెడ్డి గణాంకాలతో సహా వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనే రూ.32వేల కోట్లకు పైగా అప్పులు పెరగడం ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. ఒక లాభదాయక సంస్థ ఇంత భారీగా అప్పుల్లో కూరుకుపోవడం వెనుక ఉన్న కారణాలను విచారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ, మేనేజ్‌మెంట్ వైఫల్యాలు, రాజకీయ జోక్యం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేవలం అప్పులే కాకుండా, సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాల్సి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కార్మికుల చెమట చుక్కలతో నడిచే సంస్థలో వారి ప్రయోజనాలను పణంగా పెట్టడం అన్యాయమని ఆయన అన్నారు. కార్మికులకు అందాల్సిన రావాల్సిన ప్రయోజనాలు, బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన తెలిపారు. కార్మికుల హక్కులను కాపాడటంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి సీఎండీ పదవీకాలాన్ని మరో 4 ఏళ్లు పొడిగించడంపై కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులను కీలక పదవుల్లో కూర్చోబెట్టి సంస్థను లూటీ చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం సింగరేణిలో పూర్తిస్థాయి సీఎండీ లేకపోవడం, కేవలం ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడపడం సంస్థ అభివృద్ధికి ఆటంకమని ఆయన అన్నారు. సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం వల్ల సంస్థ నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. సింగరేణి సంస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. గత పాలకులు చేసిన తప్పుల వల్ల సంస్థకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పునర్వైభవం కోసం తాము పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. సింగరేణికి పూర్వవైభవం తీసుకువచ్చే వరకు బీజేపీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# నైనీ బొగ్గు గనుల టెండర్ రద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ జిల్లాలో విస్తరించి ఉన్న నైనీ బొగ్గు గని వ్యవహారం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనంగా మారింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ గనికి సంబంధించిన టెండర్లను అనూహ్యంగా రద్దు చేయడంతో ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. ఈ పరిణామం జరిగిన కొన్ని గంటల్లోనే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి, దీనిపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించడం గమనార్హం. కేవలం పాలనాపరమైన కారణాల వల్లనే టెండర్లు రద్దు చేశామని సింగరేణి యాజమాన్యం చెబుతున్నప్పటికీ, దీని వెనుక భారీ వ్యూహాలు, ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలో చేత్న శుక్లా, మర్పల్లి వెంకటేశ్వర్లు వంటి కీలక అధికారులు ఉండటంతో ఈ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ వివాదానికి ప్రధాన కేంద్రమైన నైనీ బొగ్గు గని సుమారు 626 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. ఇక్కడ లభించే బొగ్గు నాణ్యత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉండటమే కాకుండా, మార్కెట్‌లో దీనికి ఉన్న డిమాండ్ సామాన్యమైనది కాదు. అందుకే ఈ గనిని దక్కించుకోవడానికి జాతీయ స్థాయిలో అనేక మైనింగ్ దిగ్గజాలు పోటీపడుతున్నాయి. ముఖ్యంగా వెయ్యి ఎకరాలకు పైగా ఉన్న ఈ మైనింగ్ క్షేత్రంలో వాటా కోసం పెద్ద ఎత్తున లాబీయింగ్ జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భారీ టెండర్ ద్వారా లభించే లాభాలపై కన్నేసిన కొన్ని సంస్థలు అడ్డదారుల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నిజానికి గురువారం సాయంత్రం 5 గంటలకు బిడ్ల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఉదయమే రద్దు ప్రకటన రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సింగరేణి సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ఒకరకమైన హీట్ పెంచింది. రాజకీయ వర్గాల్లో దీనిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, అందుకే కేంద్రం జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు, ప్రభుత్వ వర్గాలు మాత్రం సాంకేతిక కారణాల వల్లే వాయిదా వేసినట్లు సమర్థించుకుంటున్నాయి. ఏది ఏమైనా, ఉదయం రద్దు ప్రకటన రావడం, మధ్యాహ్నానికే కేంద్రం కమిటీని వేయడం శరవేగంగా జరిగిన పరిణామాలుగా కనిపిస్తున్నాయి.

నైనీ గనుల విషయంలో ఇలాంటి వివాదాలు



తలెత్తడం ఇదేమీ మొదటిసారి కాదు. గత చరిత్రను పరిశీలిస్తే, 2016లో కూడా ఇవే తరహా ఆరోపణలు రావడంతో అప్పట్లో టెండర్లను రద్దు చేశారు. అప్పుడు కూడా పారదర్శకత కోసం కొత్త నిబంధనలతో వస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఇప్పుడు మళ్ళీ అదే పరిస్థితి పునరావృతం కావడం యాదృచ్ఛికం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. వరుసగా రెండోసారి ఈ గని టెండర్లు రద్దు కావడంతో, సింగరేణి ప్రతిష్ట మసకబారుతుందనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. మైనింగ్ మాఫియా ప్రమేయం ఉందనే వార్తలు ఈ వ్యవహారాన్ని మరింత జటిలం చేస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ టెండర్ల రద్దు కావడం మరింత రాజకీయ దుమారానికి దారితీసింది. గత కొద్ది రోజులుగా ఈ అంశంపై సోషల్ మీడియాలో, ప్రధాన స్రవంతి మీడియాలో విభిన్న కథనాలు ప్రచారమయ్యాయి. ముఖ్యంగా ఒక ప్రముఖ వార్తా ఛానల్ ఈ టెండర్ల వెనుక ఒక మంత్రి, ఐఏఎస్ అధికారుల హస్తం ఉందని వార్తలు ప్రసారం చేసింది. దీనికి ప్రతిస్పందనగా అధికార పక్షం కూడా కౌంటర్ ఇచ్చింది. డిప్యూటీ సీఎం ఫోటోలతో కూడిన కథనాలు రావడం వల్ల ఈ వ్యవహారం నేరుగా ప్రభుత్వం మీదకు మళ్లింది. దీంతో ఈ వ్యవహారం కేవలం ఒక సంస్థకు సంబంధించింది కాకుండా ప్రభుత్వాల మధ్య ఘర్షణగా మారింది.

కేంద్రం నియమించిన ఇద్దరు సభ్యుల కమిటీ సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి అన్ని రికార్డులను పరిశీలించనుంది. టెండర్ రద్దుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, అసలు గైడ్ లైన్స్ పాటించడంలో ఎక్కడ లోపం జరిగింది అనే అంశాలపై వారు లోతైన విచారణ జరుపుతారు. కోల్ ఇండియాకు చెందిన సీనియర్ అధికారులు ఈ కమిటీలో ఉండటంతో, నివేదిక అత్యంత కఠినంగా ఉండే అవకాశం ఉంది. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది. అవసరమైతే ఈ ప్రక్రియను కేంద్ర సంస్థల పర్యవేక్షణలోకి తీసుకునే అవకాశం లేకపోలేదు.

ఈ గనిలో దొరికే బొగ్గు నాణ్యత అత్యధికంగా ఉండటమే ఇన్ని గొడవలకు కారణమని చెప్పవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గును వెలికితీసి, మార్కెట్‌లో భారీ ధరకు విక్రయించే వీలుండటంతో ప్రైవేట్ కంపెనీలు దీనిపై గట్టిగా కన్నేశాయి. సింగరేణికి కేటాయించిన ఈ మైనింగ్ ప్రాజెక్టులో ఏదో రకంగా భాగస్వామ్యం పొందాలని మైనింగ్ మాఫియా ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగానే అధికారులు మరియు రాజకీయ నాయకులపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే టెండర్ రద్దు నిర్ణయం వెనుక లోతైన కారణాలు ఉండవచ్చని అంతా భావిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా సింగరేణి కార్మిక సంఘాలు కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. సంస్థ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమైతే కార్మికుల భవిష్యత్తు ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సింగరేణికి, ఇలాంటి వివాదాలు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. కేంద్రం జోక్యం చేసుకోవడం ద్వారా అసలు నిజాలు బయటపడతాయని సామాన్య ప్రజలు ఆశిస్తున్నారు. లేదంటే ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. విచారణ కమిటీ ఇచ్చే నివేదికపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఒకవేళ టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై వేటు పడే అవకాశం ఉంది. అలాగే, సింగరేణి యాజమాన్యం భవిష్యత్తులో పిలిచే టెండర్లపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన షరతులు విధించే అవకాశం కూడా లేకపోలేదు. పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఈ నైనీ బొగ్గు గని ఒక యుద్ధ ప్రాతిపదికన మారడం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా చర్చనీయాంశంగా మారింది. సింగరేణి సంస్థ తన ఘన చరిత్రను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వివాదాల వల్ల జాతీయ స్థాయిలో సంస్థకు ఉన్న గుర్తింపు దెబ్బతినే అవకాశం ఉంది. నైనీ బొగ్గు గని ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కితేనే సంస్థకు ఆదాయం, రాష్ట్రానికి విద్యుత్ అవసరాలు తీరుతాయి. రాజకీయాలకు అతీతంగా, పారదర్శక పద్ధతిలో టెండర్లు నిర్వహించి అర్హులైన వారికే పని అప్పగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఈరోజు కేటీఆర్ వంతు!

**మొదటిపేజీ తరువాయి**

వాస్తవానికి ఈ కేసు విచారణ గత ఏడాది మార్చి నుంచే కొనసాగుతోంది. అయితే ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించడం చర్చనీయాంశమైంది. దాదాపు ఏడున్నర గంటల పాటు సాగిన ఆ విచారణలో అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. హరీశ్‌రావు విచారణ ముగిసిన కొద్ది రోజులకే కేటీఆర్‌కు నోటీసులు రావడం గమనార్హం. అంటే ఈ వ్యవహారంలో సిట్ దగ్గర పక్కా ఆధారాలు ఉన్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. హరీశ్‌రావు విచారణ సమయంలో అధికారులు కొన్ని కఠినమైన షరతులు విధించారు. ఈ కేసు దర్యాప్తుతో సంబంధమున్న సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించకూడదని ఆయనకు స్పష్టం చేశారు. అలాగే సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. విచారణ ఇంకా పూర్తి కాలేదని, అవసరమైతే హరీశ్‌రావును మరోసారి పిలుస్తామని అధికారులు పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ఈ కేసు మూలాలు చాలా లోతుగా ఉన్నాయని అర్థమవుతోంది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ ఆరోపణలు వచ్చినప్పటి నుండి రాజకీయ ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు నిందితులపై ఇప్పటికే ప్రధాన అభియోగపత్రాలను సిట్ దాఖలు చేసింది. గత ప్రభుత్వ హయాంలో కొందరు పోలీసు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణ. ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూశారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఇందులో రాజకీయ పెద్దల ప్రమేయం ఎంతవరకు ఉందనేది ఇప్పుడు తేలాల్సి ఉంది.ఈ దర్యాప్తు ప్రక్రియలో సిట్ అధికారులు అత్యంత రహస్యంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే అరెస్టయిన పోలీసు అధికారుల స్టేట్‌మెంట్ల ఆధారంగా మరికొంత మందిని ప్రశ్నిస్తున్నారు. ఆ సమాచారం ప్రకారమే ఇప్పుడు కేటీఆర్ పేరు తెరపైకి వచ్చినట్లు సమాచారం. శుక్రవారం జరగబోయే విచారణలో కేటీఆర్ ఎలాంటి వివరణ ఇస్తారనేది అత్యంత కీలకంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పరిసరాల్లో పోలీసు బందోబస్తు కూడా పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలో అధికారం మారిన తర్వాత పాత ప్రభుత్వానికి సంబంధించిన పలు నిర్ణయాలు, చర్యలపై విచారణలు జరుగుతున్నాయి. అందులో ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు అత్యంత ప్రధానమైంది. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే ఈ విచారణలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళ్లాలని సిట్‌కు స్పష్టమైన ఆదేశాలు ఉన్నట్లు సమాచారం. ఇది కేవలం రాజకీయ అంశమే కాదు, చట్టపరమైన చిక్కులకు కూడా దారితీసే అవకాశం ఉంది. కేటీఆర్ విచారణకు హాజరైనప్పుడు సిట్ అధికారులు పక్కాగా సిద్ధం చేసిన ప్రశ్నవళిని ఆయన ముందు ఉంచే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడకం, నిధుల మళ్లింపు వంటి అంశాలపై ఆయన్ను నిలదీసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే దర్యాప్తులో భాగంగా సేకరించిన డాక్యుమెంట్లు, డిజిటల్ సాక్ష్యాలను కేటీఆర్ ముందు ఉంచి ఆయన వివరణ కోరనున్నారు. ఈ విచారణ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేసే అవకాశం కూడా ఉంది.

ఈ కేసు దర్యాప్తు జరుగుతున్న తీరు చూస్తుంటే మున్ముందు మరిన్ని కీలక అరెస్టులు ఉండేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొందరు ఉన్నతాధికారులు జైల్లో ఉండగా, ఇప్పుడు రాజకీయ నాయకుల వంతు వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు కారణం కావచ్చు. ఒకవేళ కేటీఆర్ విచారణలో ఏదైనా సంచలన విషయం బయటకు వస్తే రాష్ట్ర రాజకీయాల దిశే మారిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి కేటీఆర్‌కు నోటీసులు అందడం అనేది ఈ కేసులో ఒక పెద్ద అడుగు. శుక్రవారం ఉదయం ఆయన సిట్ కార్యాలయానికి వెళ్తారా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. చట్టం ప్రకారం ఆయనకు మినహాయింపులు పొందే అవకాశం ఉన్నా, రాజకీయంగా దాన్ని ఎలా ఎదుర్కోవాలో బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో ప్రతి రోజూ కొత్త విషయాలు వెలుగులోకి వస్తూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.



# గులాబీ బాస్ గుండెల్లో గుబులు



**మొదటిపేజీ తరువాయి**

రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా మారింది. సుదీర్ఘంగా సాగిన ఈ విచారణలో ట్యాపింగ్ పరికరాల కొనుగోలు, విదేశీ పర్యటనలు, అధికారుల ప్రమేయంపై అనేక ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. హరీశ్ రావు వంటి కీలక నేతను విచారణకు పిలవడమంటే, సిట్ వద్ద గట్టి ఆధారాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, ఇదంతా రాజకీయ కుట్రలో భాగమని కొట్టిపారేస్తున్నారు. ఈ విచారణ అనంతరం తదుపరి నోటీసులు ఎవరికి అందబోతున్నాయనే అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలోనే తన వ్యక్తిగత ఫోన్ ట్యాప్ అవుతోందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసులో బాధితురాలిగా నిలుస్తారా లేక విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆమెను విచారణకు పిలిస్తే, అది కేవలం ట్యాపింగ్ వ్యవహారానికే పరిమితం కాకుండా, ఇతర ఆర్థిక లావాదేవీల కోణంలో కూడా ప్రశ్నలు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే లిక్కర్ కేసులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న కవితకు, ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు మరో సవాలుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తూ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నాయి.

అన్నింటికంటే ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు అందే అవకాశం ఉందన్న ప్రచారం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలియకుండా ఇంత పెద్ద ఎత్తున నిఘా యంత్రాంగం పనిచేసే అవకాశం లేదన్నది విచారణాధికారుల ప్రాథమిక అంచనాగా కనిపిస్తోంది. ఇప్పటికే అరెస్టయిన అధికారులు "పెద్దల ఆదేశాల" మేరకే తాము పనిచేశామని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ 'పెద్దలు' ఎవరో నిరూపించేందుకు సిట్ పక్కా ఆధారాల కోసం వెతుకుతోంది. ఒకవేళ కేసీఆర్‌ను విచారణకు పిలిస్తే, తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇది ఒక అపూర్వమైన, అత్యంత వివాదాస్పదమైన ఘట్టంగా మిగిలిపోతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును కేవలం ఒక నేరంగా మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా అభివర్ణిస్తోంది. ప్రజల గోప్యతను కాపాడటం తమ బాధ్యతని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే స్పష్టం చేస్తున్నారు. ఇది ఒక రకంగా బీఆర్ఎస్ పార్టీని నైతికంగా దెబ్బతీసే వ్యూహంగా కూడా కనిపిస్తోంది. ప్రభుత్వ వ్యూహాలకు ప్రతివ్యూహాలు సిద్ధం చేస్తున్న బీఆర్ఎస్, దీనిని న్యాయపరంగా ఎదుర్కోవడంతో పాటు ప్రజా క్షేత్రంలోనూ ఎండగట్టాలని భావిస్తోంది. పార్టీ కేడర్‌లో ధైర్యం నింపేందుకు నాయకత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ప్రస్తుత తరుణంలో సిట్ విచారణ పరిధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, ఇతర రాష్ట్రాలతో ఉన్న సంబంధాల వైపు కూడా మళ్లుతోంది. ఈ కేసులో వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, విదేశాల నుంచి తెప్పించిన సాఫ్ట్‌వేర్ వంటి అంశాలపై లోతైన దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన పలువురు అధికారులను విచారించడం ద్వారా కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఆధారంగానే రాజకీయ నేతలకు నోటీసులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో వస్తున్న ప్రతి కొత్త కోణం కేసును మరింత క్లిష్టంగా మారుస్తూ, బీఆర్ఎస్ అగ్ర నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకవేళ ఈ కేసులో కేసీఆర్ మరియు కవితలకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు లభిస్తే, అది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తుంది. ఇప్పటికే అధికారం కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి, ఈ కేసు ఒక మరణశాసనంలా మారుతుందా అనే అనుమానాలు కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ తన రాజకీయ పట్టును బిగించేందుకు ఈ అవకాశాన్ని వాడుకుంటోంది. విచారణ పారదర్శకంగా జరుగుతోందని ప్రజలను నమ్మించడంలో ప్రభుత్వం సఫలమైతే, రాబోయే ఎన్నికల్లో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. రాజకీయాల కంటే కూడా చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఉత్కంఠభరిత వాతావరణంలో తెలంగాణ సమాజం మొత్తం సిట్ తదుపరి చర్యల కోసం ఎదురుచూస్తోంది. రాష్ట్రంలో గత పదేళ్లుగా జరిగిన పరిపాలనలో ఇలాంటి చీకటి కోణాలు ఎన్ని ఉన్నాయనేది ఇప్పుడు సామాన్యుల్లో కూడా చర్చకు దారితీస్తోంది. వ్యక్తిగత గోప్యతకు భంగం కలగడం అనేది అత్యంత తీవ్రమైన అంశం కావడంతో, మేధావులు, పౌర సమాజం కూడా ఈ విచారణపై దృష్టి సారించాయి. దోషులు ఎవరైనా సరే కఠినంగా శిక్షించబడాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కేసు ఫలితం కేవలం కొందరు వ్యక్తుల భవితవ్యాన్ని మాత్రమే కాకుండా, తెలంగాణ రాజకీయాల దిశను కూడా నిర్ణయించబోతోంది.

# గ్రూప్ 1 మెయిన్స్‌పై ఊహించని ట్విస్ట్

**మొదటిపేజీ తరువాయి**

పోరాడుతున్న వారిలోనూ తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఈ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల ప్రక్రియ ఆది నుంచి వివాదాల సుడిగుండంలోనే సాగుతోంది. పరీక్షా పత్రాల మూల్యాంకన విధానంపై అభ్యర్థులు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేశారు. డిజిటల్ మూల్యాంకనంలో లోపాలు ఉన్నాయని, మార్కుల కేటాయింపులో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ చాలామంది కోర్టు మెట్లు ఎక్కారు. అభ్యర్థుల వాదనలను సుదీర్ఘంగా విన్న సింగిల్ బెంచ్ గతంలో సంచలన తీర్పునిచ్చింది. మొత్తం మూల్యాంకన ప్రక్రియను రద్దు చేసి, నిబంధనల ప్రకారం మళ్లీ రీవాల్యుయేషన్ చేపట్టాలని ఆదేశించడంతో టీఎస్‌పీఎస్సీ ఒక్కసారిగా షాక్‌కు గురైంది.




సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషన్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవేళ మళ్లీ రీవాల్యుయేషన్ చేపడితే మొత్తం ఎంపిక జాబితా తలకిందులయ్యే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావించింది. అందుకే ఆలస్యం చేయకుండా సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఇచ్చిన రీవాల్యుయేషన్ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించింది. అయితే ఈ స్టే ఇస్తున్న సమయంలోనే న్యాయస్థానం ఒక కీలకమైన షరతును కూడా విధించిందని గుర్తుంచుకోవాలి.

కోర్టు అప్పట్లో ఏమందంటే, ప్రస్తుతం జరుగుతున్న నియామక ప్రక్రియ మొత్తం కోర్టు ఇచ్చే తుది తీర్పుకు లోబడి మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. దీని అర్థం ఏమిటంటే, ఒకవేళ భవిష్యత్తులో కోర్టు నియామకాలను రద్దు చేస్తే, అప్పటికే ఉద్యోగంలో చేరిన వారు కూడా ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగి, ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేసింది. ఈ 562 మంది ఇప్పుడు వివిధ శాఖల్లో కీలకమైన అధికారుల హోదాలో శిక్షణ పొందుతున్నారు లేదా విధుల్లో చేరారు. వీరి భవితవ్యం ఇప్పుడు పూర్తిగా ఫిబ్రవరి 5న వచ్చే తీర్పుపైనే ఆధారపడి ఉంది. గురువారం ఉదయం నుంచే అభ్యర్థులందరి కళ్లు హైకోర్టు వైపే ఉన్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఈ కేసు గురించిన చర్చలు జోరుగా సాగాయి. తీర్పు కాపీ సిద్ధంగా ఉందని, స్పష్టత వస్తుందని అందరూ ఆశించారు. కానీ కోర్టులో సీన్ రివర్స్ అయింది. తీర్పు కాపీ ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని, కొన్ని సాంకేతిక అంశాలను సరిచూడాల్సి ఉందని ధర్మాసనం లాయర్లకు వివరించింది. దీంతో విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ అవాంతరంతో అభ్యర్థులకు నిరీక్షణ తప్పనిసరి అయింది.

ఈ కేసులో ప్రధానంగా అభ్యర్థులు కోరుతున్నది పారదర్శకత మాత్రమే. ఒకే తరహా సమాధానాలకు వేర్వేరు మార్కులు రావడం, డేటా ఎంట్రీలో తప్పులు దొర్లడం వంటి అంశాలను వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు కమిషన్ మాత్రం తాము అత్యున్నత ప్రమాణాలతో మూల్యాంకనం పూర్తి చేశామని వాదిస్తోంది. ఈ రెండు వాదనల మధ్య సమతుల్యత సాధించడం కోర్టుకు కూడా పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటికే ఎంపికై విధుల్లో ఉన్న వారిని తొలగిస్తే అది ఒక పెద్ద సామాజిక సమస్యగా మారుతుందని, అదే సమయంలో అనర్హులకు ఉద్యోగాలు వస్తే అది నిజమైన ప్రతిభావంతులకు అన్యాయం అవుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం స్టేటస్ కో కొనసాగుతున్నప్పటికీ, అభ్యర్థుల్లో మానసిక ఒత్తిడి విపరీతంగా పెరిగిపోతోంది. గ్రూప్ 1 అంటే రాష్ట్రంలో అత్యున్నత స్థాయి ఉద్యోగం. దీని కోసం లక్షలాది మంది యువత తమ జీవితంలోని విలువైన కాలాన్ని వెచ్చిస్తారు. ఇలాంటి కీలకమైన పరీక్షల విషయంలో న్యాయపరమైన చిక్కులు నెలకొనడం వల్ల అభ్యర్థుల కెరీర్ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని, కోర్టు అడిగిన అన్ని వివరాలను త్వరగా సమర్పించి కేసును ఒక కొలిక్కి తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. నియామక పత్రాలు అందుకున్న 562 మంది అభ్యర్థులు ప్రస్తుతం కత్తి మీద సాములాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మరోవైపు కోర్టు కేసు వేసిన అభ్యర్థులు తమకు న్యాయం జరుగుతుందనే గట్టి నమ్మకంతో ఉన్నారు. సింగిల్ బెంచ్ అప్పట్లో రీవాల్యుయేషన్ ఆదేశాలు ఇచ్చిందంటే ఖచ్చితంగా లోపాలు ఉన్నాయని వారు వాదిస్తున్నారు. డివిజన్ బెంచ్ కూడా ఈ అంశాలను నిశితంగా పరిశీలిస్తోంది. ఫిబ్రవరి 5వ తేదీ నాటికి తీర్పు కాపీ సిద్ధమవుతుందని కోర్టు చెప్పడంతో, ఆ రోజు వెలువడే నిర్ణయం తెలంగాణ గ్రూప్ 1 చరిత్రలో ఒక కీలక మలుపు కానుంది. అప్పటి వరకు అటు అధికారులు, ఇటు అభ్యర్థులు ఉత్కంఠతో వేచి చూడక తప్పదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది నిరుద్యోగులు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. కేవలం ఈ 562 మంది భవిష్యత్తే కాదు, రాబోయే నోటిఫికేషన్ల విధానం కూడా ఈ తీర్పుపైనే ఆధారపడి ఉంటుంది. పారదర్శకత విషయంలో కమిషన్ ఎక్కడ తప్పు చేసిందో కోర్టు ఎత్తిచూపితే, భవిష్యత్తులో అలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. రాజకీయంగా కూడా ఈ అంశం ప్రభుత్వానికి ఒక పరీక్షలా మారింది. విపక్షాలు కూడా ఈ విషయంలో ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నాయి, కాబట్టి కోర్టు తీర్పు ప్రభుత్వ ప్రతిష్టకు కూడా ముడిపడి ఉంది.

# 'ప్రశ్నిస్తూనే ఉంటాం'

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు అధికార పార్టీ కుట్రలు చేస్తోందని, కానీ ఇలాంటి బెదిరింపులకు తాము లొంగే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సమాజం గమనిస్తోందని, కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి ప్రజల సంక్షేమం కోసం నిధులు వెచ్చించిందని హరీశ్ రావు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం విచిత్రమైన రీతిలో ప్రజల ఖాతాల నుంచే డబ్బులు ఎలా తీసుకోవాలా అని ఆలోచిస్తోందని ఎద్దేవా చేశారు. ఇది ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వం చేయాల్సిన పని కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల గురించి ప్రజలు ఇప్పుడు మంత్రులను నిలదీస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న మంత్రులకు సామాన్య జనం నుంచి గట్టి నిరసన ఎదురవుతోందని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోందని ఆయన విశ్లేషించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే కేటీఆర్‌కు సిట్ నోటీసులు పంపారనేది స్పష్టంగా కనిపిస్తోందని, ఇదంతా ఒక పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే తమపై కక్ష కట్టారని ఆయన ధ్వజమెత్తారు. కేటీఆర్, తాను అసెంబ్లీ లోపల, వెలుపల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గట్టిగా ప్రశ్నిస్తున్నామని, అందుకే తమను అణిచివేసే ప్రయత్నం జరుగుతోందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా తమ గొంతు నొక్కలేరని ఆయన హెచ్చరించారు. ప్రజా పక్షాన నిలబడి పోరాడటం బీఆర్ఎస్ డీఎన్ఏలోనే ఉందని, ఇలాంటి నోటీసులకు భయపడే రకం కాదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడుకోవడం రేవంత్ రెడ్డి నైజమని, ఇది రాజ్యాంగ విలువలకే విరుద్ధమని ఆయన మండిపడ్డారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిదికి సంబంధించిన కుంభకోణం బయటకు రాకుండా చూసేందుకే ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. సొంత కుటుంబ సభ్యుల అవినీతిని దాచిపెట్టడానికి ప్రతిపక్ష నేతలపై బురద జల్లడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం కుంభకోణాలమయంగా మారిందని, మంత్రులందరూ తమ వాటాల కోసం అంతర్గతంగా కొట్టుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పరిపాలనను గాలికి వదిలేసి, కేవలం కమీషన్ల కోసం పాకులాడుతున్నారని కాంగ్రెస్ మంత్రులపై ఆయన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పరాకాష్టకు చేరాయని, ఆ పార్టీ పని తెలంగాణలో దాదాపు ముగిసిపోయిందని హరీశ్ రావు జోస్యం చెప్పారు. నాయకుల మధ్య సమన్వయం లేదని, ప్రజలకు సమాధానం చెప్పలేక నేతలు జంకుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే ఇలాంటి గిల్లికజ్జాలు పెట్టుకుంటున్నారని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో నిలబడలేక, దొడ్డిదారిన ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టాలని చూడటం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు అందరూ మోసపోయామని ఫీలవుతున్నారని హరీశ్ రావు అన్నారు. రుణమాఫీ దగ్గర నుంచి నిరుద్యోగ భృతి వరకు ప్రతి విషయంలోనూ కాంగ్రెస్ అబద్ధాలు ఆడిందని ఆయన మండిపడ్డారు. ఈ వైఫల్యాలపై ప్రజలు తిరగబడతారనే భయంతోనే ప్రభుత్వం ఇలాంటి కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆయన విశ్లేషించారు. కానీ తాము ప్రజల గొంతుకగా నిలబడతామని, ఏ శక్తి తమను ఆపలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపడంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, కానీ వ్యక్తిగత కక్షలతో నోటీసులు జారీ చేయడం హేయమైన చర్య అని హరీశ్ రావు అభివర్ణించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి పనులు చేయడం రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, దాన్ని అడ్డుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా నిజం ఎప్పటికైనా గెలుస్తుందని, తాము చట్టప్రకారం అన్నింటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ నేతలను నిద్రపోనివ్వమని ఆయన శపథం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా విఫలం కాక తప్పదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. నోటీసుల భయం తమకు లేదని, తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా డైవర్షన్ పాలిటిక్స్ పక్కన పెట్టి ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని హరీశ్ రావు హితవు పలికారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్..**

**కామారెడ్డి విశాలభారతి:** సీఎం రేవంత్ రెడ్డిపై పోలీసుల కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు.



**ప్రజా ప్రభుత్వం పేరుతో అరాచకాలు..**

కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రజా ప్రభుత్వం పేరుతో అరాచకాలు సృష్టిస్తూ సమాజాన్ని విడదీసే విధంగా సీఎం మాటలు ఉన్నాయన్నారు. ఈనెల 18న ఖమ్మంలో టీడీపీని కేసీఆర్ లేకుండా చేశాడని, రాష్ట్రం మొత్తంలో బీఆర్ఎస్ పార్టీ గద్దెలను కూల్చాలని మాట్లాడడం చూస్తే సీఎం ఎంత అసహనంతో ఉన్నాడో అర్థం అవుతుందన్నారు. బీఆర్ఎస్పై మాట్లాడే అర్హత సీఎంకు ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన గొప్ప పోరాట యోధుడు, రాష్ట్ర మొదటి సీఎం కేసీఆర్ మీద రెండేళ్లుగా నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పి ప్రజా వ్యతిరేక పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రేవంత్ రెడ్డి ఖబడ్దార్...**

రేవంత్ రెడ్డి ఖబడ్దార్.. ఇకనైనా ఈ మాటలు మానుకో గంప గోవర్ధన్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై చిన్నచిన్న విషయాలకే కేసులు పెడుతున్నారని, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తూ రాష్ట్రంలో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాను సీఎం అని ఏది చెప్తే అది నడుస్తుందని, ప్రతిపక్షం ఉండొద్దని.. బీఆర్ఎస్ ఉండొద్దని సీఎం అనుకుంటున్నాడన్నారు. టీడీపీ నుంచి ఎమ్మెల్యే చేసి ఇవాళ ఏ పార్టీలో ఉన్నావో ఆలోచించుకోవాలని సూచించారు. నాడు ఎన్టీఆర్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పార్టీ పెట్టాడని, కేంద్రంలో కూడా కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కూల్చారని గుర్తు చేశారు. ఇవాళ టీడీపీ గురించి ఏం మాట్లాడుతున్నావని నిలదీశారు. కాంగ్రెస్లో రేవంత్ రెడ్డి టిడిపి గిరించి మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.

**దృష్టి మళ్లించేందుకు....**

ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి దృష్టి మళ్లించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన నేత కేసీఆర్ అని, కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్రలో నిలిచే వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని మాటలు అంటే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజలకు సుపరిపాలన కోసం జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, రెండేళ్లలో జిల్లాకు ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. షబ్బీర్ అలీకి కామారెడ్డి అభివృద్ధి ఇవాళ గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. నాటి సీఎం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తే నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, 330 పడకల ఆస్పత్రి వస్తుందని, రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందుతుందని కేసీఆర్ ఆలోచించారన్నారు. సీఎం తన భాష మార్చుకోవాలని సూచించారు.

# ఫ్యూచర్ సిటీకి ఏఐ కళ

**మొదటిపేజీ తరువాయి**

మారబోతోందని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. పర్యావరణ హితమైన అభివృద్ధికి పెద్దపీట వేయడం ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం. సాధారణంగా డేటా సెంటర్లకు విపరీతమైన విద్యుత్ అవసరం అవుతుంది కానీ ఈ ప్రాజెక్టులో ఆ అవసరాన్ని పునరుత్పాదక ఇంధనంతో తీర్చబోతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల సామర్థ్యం గల గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను కూడా సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న నెట్ జీరో ఉద్గారాల లక్ష్యానికి ఎంతో ఊతమిస్తుంది. పారిశ్రామిక వృద్ధి సాధిస్తూనే పర్యావరణాన్ని కాపాడుకోవాలనే తెలంగాణ ప్రభుత్వ విధానానికి ఈ ప్రాజెక్టు ఒక రోల్ మోడల్‌గా నిలవనుంది. దావోస్ భేటీలో యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, ఇతర ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు తెలంగాణ పట్ల అంతర్జాతీయ సంస్థలకు ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే బలమైన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆధునిక కాలంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏ స్థాయిలో అవసరమో వివరిస్తూ భవిష్యత్తు తరాలకు ఈ ప్రాజెక్టు ఒక వరమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు నిర్మాణాలు మాత్రమే కాదు ప్రకృతితో మమేకమైన పురోగతి అని ఆయన స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి టెక్నాలజీ డెస్టినేషన్‌గా మార్చడంలో ఇది తొలి అడుగు అని అభివర్ణించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు, పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఏఐ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకోవడానికి తెలంగాణ సర్వం సిద్ధంగా ఉందని ఆయన చాటి చెప్పారు. ఈ నిర్ణయం వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీ అనే కాన్సెప్ట్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ నగరంలో ప్రపంచ స్థాయి డేటా సెంటర్ రావడం వల్ల ఇక్కడి ఎకోసిస్టమ్ పూర్తిగా మారిపోనుంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మాత్రమే కాకుండా డేటా మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలకు ఇది కేంద్రంగా మారుతుంది. ఇది కేవలం ఒక కార్యాలయం ఏర్పాటు కాదు ఒక కొత్త సాంకేతిక విప్లవానికి నాంది అని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ ఉత్సాహం, పారిశ్రామిక వేత్తల ఆసక్తి తోడైతే తెలంగాణ ఆర్థిక గమనం మరింత వేగవంతం అవుతుంది.




రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం వేగంగా స్పందిస్తుందని తెలిపారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు మంజూరు చేయడం వల్ల పారిశ్రామికవేత్తలకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర ఖజానాకు చేరడమే కాకుండా స్థానిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సమగ్ర అభివృద్ధి సూత్రంతో ప్రభుత్వం అడుగులు వేయడం వల్లే ఇటువంటి భారీ విజయాలు వరిస్తున్నాయి. తెలంగాణ రైజింగ్ టీమ్ దావోస్ పర్యటనలో సాధించిన ఈ విజయం రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ ఆర్థిక వేదిక వంటి వేదికలపై తెలంగాణ గొంతు బలంగా వినిపించడం మన రాష్ట్ర కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తోంది. కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు అవసరమైన పునాదులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పటిష్టంగా వేస్తోంది. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా పునరుత్పాదక ఇంధనాన్ని డేటా సెంటర్లకు అనుసంధానం చేయడం అనేది ఒక అద్భుతమైన ప్రయోగం, గొప్ప ముందడుగు అని చెప్పవచ్చు.



# ఇందూరు గడ్డపై కమల వికాసం తథ్యం

- కేంద్ర పథకాలతో సోకులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్, విశాలభారతి:**



రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్లో కమలం వికసిస్తుందని ఇందూరు గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 43, 52, 28, 51, 14 మరియు 15వ డివిజన్ లలో కోటి రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత భారతదేశం తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ప్రపంచం లోని అనేక దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొని ఆర్థికంగా చతికిలబడిపోయాయని, ఆ దేశాల్లో జీవిస్తున్న ప్రజల ప్రాణాలకు రక్షణ కూడా లేకుండా పోయిందని అన్నారు. కానీ మోడీ నాయకత్వంలో ఉన్న భారతదేశం తిరుగులేని శక్తిగా విశ్వగురువుగ ఎదుగుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశభక్తి ఆధ్యాత్మిక చింతన సనాతన ధర్మం రోజురోజుకు పెరుగుతున్నాయని భారతీయులంతా బిజెపి వైపు మగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సాధించిన తిరుగులేని విజయమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం, ఇంటింటికి మంచినీరు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మరియు రేషన్ కార్డులు ఇలా ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని, కానీ అంతా తామే చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మరియు టిఆర్ఎస్ రెండూ కూడా కుటుంబ పార్టీలేనని, నిజమైన ప్రజాస్వామ్యంతో నడిచే బిజెపి పార్టీ మాత్రమే సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ మరియు సబ్ కా ప్రయాస్ అనే నినాదాలతో పనిచేస్తుందని అన్నారు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించినప్పటికీ కేవలం రెండు, మూడు సీట్ల తేడాతో కార్పొరేషన్ సీటు కోల్పోయామని, అనైతిక హక్కులతో మేయర్ పీఠం దక్కించుకున్న ఎంఐఎం, టిఆర్ఎస్ నగరానికి చేసిందేమీ లేదని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపి తిరుగులేని విజయం సాధించి మేయర్ పీఠం కైవసం చేసుకుంటుందని, నగరాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ధన్ పాల్ దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో పబ్లిక్ హెల్త్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ మున్సిపాలిటీలో గురువారం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ పరిశీలించారు మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు నామినేషన్ దాఖల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు అక్కడి పరిసరాలను పరిశీలించారు మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు ఆయన వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ సిబ్బంది ఉన్నారు.

## ఎన్ఫ్‌బి పథకం గురించి అవగాహన



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లా, మోస్రా తహసిల్దార్ కార్యాలయంలో గురువారం తహసిల్దార్ బొడ్డు రాజశేఖర్, ఎంపీడీవో కే. శ్రీనివాసులు, సంయుక్తంగా తహసిల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామపంచాయతీ సెక్రటరీలకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎన్ ,ఎఫ్ బి ,ఎస్, పథకం గురించి అవగాహన కల్పించడం జరిగిందని తహసిల్దార్ ,ఎంపీడీవో తెలియజేశారు. వీరు మాట్లాడుతూ ఈ పథకం యొక్క ప్రయోజనాలను మండల పరిధిలో పనిచేస్తున్న ప్రతి గ్రామపంచాయతీ సెక్రటరీలు పనిచేయవలసి ఉంటుందని సూచించారు. ఈ పథకం యొక్క ప్రయోజనం అర్హులైన ప్రతి పేదవానికి లబ్ధి పొందే విధంగా చూడవలసిన బాధ్యత సెక్రటరీలపై ఉందని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల పరిధిలోని మండలాధికారులతోపాటు మోస్రా గ్రామపంచాయతీ సెక్రటరీ హంగర్గా శ్రవణ్ కుమార్, చింతకుంట సెక్రటరీ సౌమ్య, గోవూర్ సెక్రటరీ శేఖర్, తిమ్మాపూర్ సెక్రెటరీ భూమేష్, చే నెంబర్ తాండ సెక్రటరీ కే .మహేశ్వరి, మండల పరిధిలోని అధికారులతో పాటు మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ జనరల్ ఆసుపత్రి ఏర్పాటు




**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ లైన్స్ క్లబ్ సేవలలో మరో అడుగు ముందుకు పడింది ఎన్నో ఏళ్లుగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లైన్స్ కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేద ప్రజలకు కంటి చూపును అందిస్తూ వచ్చారు గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు లైన్స్ కంటి ఆసుపత్రి వరప్రదాయినిగా మారింది అలాంటి లైన్స్ కంటి ఆసుపత్రికి అనుబంధంగా మరో జనరల్ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు బోధన్ లైన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరల్ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు ఆలోచన వచ్చింది తడవుగా చక చక అడుగులు పడ్డాయి ఆరు నెలల వ్యవధిలోనే లయన్స్ జనరల్ ఆసుపత్రికి రూపురేఖలు దిద్దుకున్నాయి ప్రభుత్వం తరపునుంచి స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సుదర్శన్ రెడ్డి రాకాసిపేటలోని కమ్యూనిటీ హాలును జనరల్ ఆసుపత్రికి కేటాయించడంతో దానిని రూపురేఖలు మార్చి కొత్త హంగులతో తీర్చిదిద్దారు సుమారు రెండు కోట్ల రూపాయలతో జనరల్ ఆసుపత్రి రూపుదిద్దుకుంది. పేద ప్రజలకు వరప్రదాయినిగా మారనున్న లయన్స్ జనరల్ ఆసుపత్రి. బోధన్ లైన్స్ చారిటబుల్ ట్రస్ట్ కు అనుబంధంగా కంటి ఆసుపత్రితో పాటు జనరల్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తుడం పేద ప్రజలకు వరప్రదాయనిగా మారనుంది లక్షల మందికి కంటి చూపుని అందించిన లైన్స్ కంటి ఆసుపత్రిలో జనరల్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తుండడం బోధన్ తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు బోధన్ బాన్సువాడ జుక్కల్ నియోజకవర్గాల పేద ప్రజలకు లైన్స్ జనరల్ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడనుంది పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి లక్షల రూపాయలు చెల్లించుకునే పరిస్థితి లేకపోవడంతో లైన్స్ జనరల్ ఆస్పత్రి వైపు అందరు చూపు పడింది. లైన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఆసుపత్రిని రెండు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నారు.

## అంతరాష్ట్ర దోపిడీ దొంగ అరెస్ట్



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ పట్టణం లోని పాత బస్టాండ్ వద్ద గత నెల జరిగిన బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దోపిడీ దొంగను బోధన్ పోలీసులు గురువారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన వేలేకర్ల సమావేశం నిర్వహించారు ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ బోధన్ పట్టణం లో గత నెల క్రితం జరిగిన జూవెలర్ దుకాణాల్లో నలుగురు అంతరరాష్ట్ర దోపిడీ దొంగలు దోపిడీకి పాల్పడి 6కిలోల వెండి ఆభరణాలు, 14 తులా ల బంగారు ఆభరణాలు దొంగిలిచ్చినట్లు బాధితులు వెల్లడించారని ఏసీపీ పేర్కొన్నారు. దోపిడీ కి పాలల్పడిన నలుగురిలో గతం లో 2 నిందితులను అదుపులోకి తీసుకుని పలుఆభరణాలు స్వాధీనం పార్చుకున్నామని ఏసీపీ వివరించారు. ఏ 4 నిందితుడు మమ్మద్ మౌలా ను కిలో వెండి 5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీన పరిచ్చుకుని రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన పట్టణ ఎస్ హెచ్ ఓ వెంకట్ నారాయణ్, ఎస్ ఐ మనోజ్, కానిస్టేబుల్ రవి, అనిల్ లను అభినందించారు.

## సాఫ్ట్ బాల్ పోటీలను ప్రారంభించిన బాల్కొండ ఎమ్మెల్యే

**నిజామాబాద్, విశాలభారతి:**



బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు . పది జిల్లాల క్రీడాకారులు సుమారుగా 350మంది రిపోర్ట్ చేశారు. వారికి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పించారు . జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమ్మర్పల్లి వేదికగా మినీ స్టేడియం నందు ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం నాగమణి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సాయన్న, పీడీ వేముల నాగభూషణం లు సంయుక్తంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించి క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు అంటే ఓటమి గెలుపులు సమానమని సక్సెస్ అంటే చదువు ఆటలు సమానంగా ఉండాలని , ఎదురు దెబ్బలు తగిలితే వాటిని తట్టుకునే శక్తి క్రీడల ద్వారా వస్తుందని , ఆటల ద్వారా శారీరిక, మానసిక స్థైర్యం వస్తుందని కావున తల్లిదండ్రులు పిల్లలు వారిని ఆటలు ఆడేలా ప్రోత్సహించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్స్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కే శోభన్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సాఫ్ట్ బాల్ క్రీడలో నిజామాబాద్ జిల్లా అన్ని విభాగాలలో ప్రథమ స్థానంలో ఉందని ఇక్కడి నుండి అత్యధిక మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్పల్లి స్పెషల్ ఆఫీసర్ రాజగంగారం , తహశీల్దార్ ప్రసాద్ , కమ్మర్పల్లి, మండల విద్యాధికారి ఆంధ్రయ గారు , జక్రాన్ పల్లి మండల విద్యాధికారి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్ , రాష్ట్ర స్కూల్ గేమ్స్ పరిశీలకులు నాగరాజు , వీరేశం, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు టీ విద్యాసాగర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి బి. మల్లేష్ గౌడ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ఉపాధ్యక్షురాలు నీరజ రెడ్డి , వీడీసీ అధ్యక్షులు బోగ రామ స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు, వెంకట్, రమేష్, నవీన్, సుజాత, స్వప్న, జోష్ణ, భాగ్య, అనికేత్, నరేష్ మరియు సీనియర్ క్రీడాకారులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలి

**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్**

**మహబూబాబాద్, విశాలభారతి:**



ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి మరియు కోర్టు ఫలితాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నేరాల గుర్తింపు డిటెక్షన్‌లో సీసీ కెమెరాల వినియోగంపై చర్చించారు. కీలక ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థవంతంగా కొనసాగించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన పెండింగ్ కేసులు, డిటెక్టెడ్ కేసులు, కన్విక్షన్ సాధించిన కేసుల పురోగతిని సమీక్షించారు. తీవ్రమైన, వివాదాస్పద కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరిపి, బలమైన సాక్ష్యాలతో చార్జ్ షీట్లు దాఖలు చేయడం ద్వారా కోర్టుల్లో శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్ కేసుల తగ్గింపును లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని, అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర స్థాయి సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. రాత్రి వేళల్లో పట్టణాలు, గ్రామాలు, హైవేలు, ఒంటరి ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించడం ద్వారా నేరాలను ముందుగానే నివారించాలని, ప్రజల్లో భద్రతా భావన పెంపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని తెలిపారు. ఫీల్డ్ పోలీసింగ్, దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అనంతరం వివాదాస్పద కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించి కోర్టుల్లో కన్విక్షన్లు సాధించిన పోలీస్ అధికారులకు అభినందన పత్రాలు అందజేశారు.

## ఆస్తి పన్ను వసూళ్లలో వంద శాతం లక్ష్యాన్ని సాదించాలి

**అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ**

**విశాలభారతి, గోదావరిఖని:**

ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు.రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. వార్డు అధికారులు , సహాయకులు , సిబ్బందితో గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ బకాయలు ఉన్న వ్యక్తులు , సంస్థలపై మొదటగా దృష్టిసారించాలని అన్నారు. అలాగే నీటి సరఫరా ఛార్జీలు , ట్రేడ్ లైసెన్స్ రుసుం లు కూడా లక్ష్యం ప్రకారం వసూలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల డేటా క్షేత్ర స్థాయిలో సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు . ఇటీవల కొంత మంది పేదలకు స్థలాల పట్టాలు ఇచ్చిన నేపథ్యంలో వారు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి వీలుగా ఎల్ టూ కేటగిరీ నుండి ఎల్ వన్ కు మార్చాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి స్వచ్ఛ వాహనం డి ఆర్ సి కేంద్రానికి వెళ్ళాలని అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మరుగు దొడ్లు , నీటి సరఫరా , లైటింగ్ , ర్యాంప్ తదితర అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ ఈ. గురువీర.ఈ.ఈ. పి. వి. రామన్ , సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు , అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఎ సి పి . శ్రీ హరి , డి ఈ లు షాభాజ్ , శాంతి స్వరూప్ , జగదీష్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం



**ఆర్మూర్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జి ఓ నేం 81.85 ప్రకారం వీఆర్ఏల వారసత్వ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వి ఆర్ ఏ జేఏసీ కన్వీనర్ వంగురూ రాములు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి డొంకేశ్వర్ మండల కేంద్రంలో గురువారం వినతి పత్రం పత్రం అందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం వీఆర్ఏల పే స్కేల్. వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందిని. ఆ హామీని నెరవేర్చలేదని. ప్రభుత్వం వెంటనే వీఆర్ఏల సమస్యలు పరిష్కరించలని . ప్రభుత్వమిచ్చిన ఆమేరకు వీఆర్ఏల సమస్యలు పరిష్కరించి వారసత్వ ఉద్యోగాలు ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డొంకేశ్వర్ మండల వీఆర్ఏల అధ్యక్షుడు గంగాధర్ .నరేష్ తిరుపతి.మైపాల్ . రాజేందర్. మోహన్. రవి చందర్.రజిత. రేఖ. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ఆర్మూర్, విశాలభారతి:** డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రైతు నివేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. 44 మంది లబ్ధిదారులకు 44.05.104 రూ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ఇల్లు కొరకు దరఖాస్తు లు చేసుకోవాలని. విడతలవారీగా నిరుపేదలందరికీ డబల్ బెడ్ రూమ్ కట్టించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మీసాల నరేష్. ఆర్ఐ అశోక్. వీఆర్ఏలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** జిల్లా కేంద్రం లోని గంగాస్థాన్ లో కొనసాగుతున్న నిజామాబాద్ నార్త్ మండల కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. కలెక్టర్ తానే స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి, తెలుగు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో పలు అంశాలను బోర్డుపై రాసి బాలికలకు బోధించారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బిస్కెట్లను విద్యార్థినులకు అందించారు. భోజన విరామ సమయంలో పలువురు బాలికలు చెస్ ఆడుతుండడాన్ని గమనించిన కలెక్టర్, తాను కూడా వారితో కలిసి నేలపై కూర్చుండి ఎంతో ఆసక్తితో చదరంగం ఆడారు. బాలికలను ఆప్యాయంగా పలకరిస్తూ, ఇష్టపడి చదువుకోవాలని వారిలో స్ఫూర్తిని పెంపొందింపజేశారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ తదితరులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్.. వ్యక్తికి జైలు శిక్ష



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్&డ్రైవ్ లో దొరికిన 5 మందిని, గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా 4 గురికి 8,000 రూపాయల జరిమానా విధించారు. ఒక వ్యక్తికి రెండవసారి పట్టుబడగా 03 రోజుల జైలు శిక్ష విధించారు.వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది.

## ట్రాఫిక్ విధుల్లో మందుబాబులు



**విశాలభారతి, పెద్దపల్లి:** మద్యం మత్తులో వాహనం నడుపుతూ పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడినా కాచాపూర్ గ్రామానికి చెందిన తీగల అజయ్ , చందపల్లి కి చెందిన పర్శ తిరుపతి, చిన్నకల్వల కు చెందిన మెరుగు సతీష్ మరియు ఖిలవనపర్తి కి చెందిన తలారి రాహుల్ అని నలుగురు వ్యక్తులను కోర్ట్ ముందు హాజరు పరచగా పెద్దపల్లి న్యాయమూర్తి మంజుల రూ.500 జరిమానా విధించడంతో పాటు, 2 రోజుల పాటు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దానిలో భాగంగా ఈరోజు పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో విచారణ ఎదుర్కొన్న మందుబాబులకు తీర్పుకు అనుగుణంగా ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ సమక్షంలో పెద్దపల్లి కమాన్, బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించారు.


## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పటల్‌లో ఏర్పాటు చేస్తున్న క్యాథ్ ల్యాబ్ సెంటర్ పనులను గురువారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, సింగరేణి జీఎం లలిత్ కుమార్ తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుని నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, క్యాథ్ ల్యాబ్ ప్రారంభమైతే రామగుండం పరిసర ప్రాంతాల ప్రజలు గుండె సంబంధిత చికిత్సల కోసం కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందవచ్చని తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాకపోకలకు సౌలభ్యంగా ఉండేలా హాస్పటల్‌కు రెండు ప్రవేశ మార్గాలు ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం మన యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ని మాణిక్ బండర్ బోర్గం కె బిజెపి 2వ డివిజన్ మేము బలపరిచిన వ్యక్తి మారంపల్లి మోహన్ ని బిజెపి పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా ప్రకటించాలని హృదయపూర్వకంగా కలిసి అభ్యర్థించడం జరిగింది. దీనికి ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందిస్తూ గ్రౌండ్ వర్క్ చేసుకోమని సలహా ఇవ్వడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో రాకేష్ రెడ్డి మాట్లాడుతూ మాణిక్ బండారు రెండవ డివిజన్లో మన కాషాయ జెండా ఎట్టి పరిస్థితులలో ఎగరవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాణిక్ బండార్ శక్తి కేంద్రం ఇంచార్జి శివలాల్ , బూత్ అధ్యక్షులు నరేందర్, అర్జున్ సింగ్, ప్రభాకర్, సాయిబాబా, ఉమేష్, రవీందర్, కిరణ్, శ్రీకాంత్ దాస్ నగర్ నుండి సిసింద్రీ , మరియు భాజపా కార్యకర్తలు పాల్గొన్నారు .

## బాలికలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

**కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నిర్వాహకులకు కలెక్టర్ హితవు**



**నిజామాబాద్, విశాలభారతి:** కస్తుర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ లో చదువుకుంటున్న ప్రతి బాలికను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ, వారి బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేయాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి నిర్వాహకులకు హితవు పలికారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, వృత్తి పరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్ళను సాధికారతతో దీటుగా ఎదుర్కోవడం, బాలికల్లో మానసిక స్థైర్యం పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను కలిగి ఉండడం తదితర అంశాలపై కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్స్ కేర్ టేకర్లు, వార్డెన్లకు విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కపిల హోటల్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు ఆయా అంశాలలో అందిస్తున్న శిక్షణ గురించి విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. క్షేత్రస్థాయిలో కేజీబీవీ బాలికలకు ఎదురైన పలు సున్నితమైన సమస్యలను పరిష్కరిస్తూ, వారిని మానసికంగా కుంగుబాటుకు గురి కాకుండా తీసుకున్న చర్యల గురించి ఈ సందర్భంగా పలువురు స్పెషల్ ఆఫీసర్లు ఆయా ఉదంతాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జీసీడీఓలు భాగ్యలక్ష్మి, సుకన్య, విజయలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్స్ కేర్ టేకర్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

## సీఎం కప్పు క్రీడలను ప్రారంభించిన సర్పంచ్



**తిరుమలగిరి, విశాలభారతి:** తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో గ్రామస్థాయి సీఎం కప్పు క్రీడలను సర్పంచ్ భాష మల్ల స్వాతి, భాస్కర్, మండల ఎంఈఓ ఐ శాంతయ్య ఉభయలు రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం కప్పు క్రీడలను గ్రామ యువకులు సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకట్ ,నాగయ్య, సైదులు, రాజు, రఘుపతి, దస్తగిరి వ్యాయామ ఉపాధ్యాయులు మహేష్,వెంకన్న, రాజీవ్ మరియు క్రీడాకారులు, యువకులు లు పాల్గొన్నారు.

## 6 కోట్ల నిధుల మంజూరు కోసం వినతి

- **జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్**
- **హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్**



**ఎల్బీనగర్, విశాలభారతి:** ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం మరియు హస్తినాపురం బైరమల్ గూడా వార్డ్ కార్యాలయలు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ను గ్రేటర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి ను కోరినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని దేవకమ్మ తోట సమీపంలో గల 3000 గజాల ప్రభుత్వ భూమిలో రెండు వార్డు కార్యాలయాలు ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం నిర్మాణం కోసం ఇటీవల జోనల్ కమిషనర్ పర్యటించిన విషయం తెలిసిందేనదే అన్నారు. ఈ విషయంపై జిహెచ్ఎంసి మేయర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మేయర్ అట్టి నిర్మాణాలకు సుమారు 6 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు సందర్భంగా మేయర్, కమిషనర్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.డివిజన్ లొ ప్రధాన సమస్యలన్నిటికీ నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మిగిలి ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని మేయర్ ను కోరినట్లు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో పాల్గొనాలి

- **డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** యువత క్రీడల్లో పాల్గొన్నప్పుడే మెదడు మేధస్సు అవుతుందని అంతే కాకుండా శరీరాన్ని ఉల్లాసంగా ఉంచుతూ జ్ఞాపక శక్తి దోహదపడుతుందని బౌద్ధ నగర్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు.గురువారం సికింద్రాబాద్ పార్లమెంట్ ఆధ్వర్యంలో ఎల్బి. స్టేడియం నిర్వహిస్తున్న ఖేలో భారత్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు బౌద్ధ నగర్ డివిజన్ నుండి ర్యాలీగా బయలుదేరి వెళ్లడం జరిగింది. ఈ ర్యాలీలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుల రవి ప్రసాద్ గౌడ్. మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్,నాయకులు వెంకటచైతన్య, నాగరాజు,జయంత్, కృష్ణ మాదిగ, రోహిత్,సాయి ప్రసాద్,రూప్ సాయి, ప్రమోద్, నరేష్,అనిల్, మహేష్, స్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత




**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం చిన్నమదూరు గ్రామంలోని జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రత నిర్వహణపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము స్వయంగా తయారు చేసిన రోడ్డు భద్రత చిహ్నాలు సమాచార కార్డులతో ప్రదర్శన నిర్వహించి రోడ్డు భద్రతా నియమంపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు రోడ్డు భద్రత అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ లో సాయి నిఖిల్ గ్రూపు ప్రథమ స్థానాన్ని, కారుణ్య గ్రూప్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు దేవరుప్పుల ఎంఈఓ జి. కళావతి మాట్లాడుతూ, రోడ్డు భద్రత చర్యలపై తల్లిదండ్రులు విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, తెలిపారు. బాల్యదశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రధాన ప్రమాదాలను నివారించే జ్ఞానం లభించడంతోపాటు విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్ ప్రసాద్ ప్రవీణ్, క్విజ్ మాస్టర్ జడ్జీలుగా వ్యవహరించారు. రాజనారాయణ, సురేష్ బాబు, రజనీకాంత్, అంజిరెడ్డి, నళిని, వసంత, రాజేశ్వరి, రాజమణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా గుప్పుమంటున్న గుడుంబా

- **గుడుంబా మత్తులో యువత... తండాల్లో అనాదలౌతున్న పిల్లలు**
- **చక్కెర, బెల్లం పదార్థాలతో కాస్తున్న సారాయి**
- **గిరిజన గ్రామాల్లో ప్రాణాల మీద పండుతున్న వ్యాపారం**
- **గుడుంబా ను అడ్డుకునే నాధుడే లేడా?**
- **మహబూబాబాద్ జిల్లాలో గుడుంబా రాజ్యం**





**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా అనే అక్రమ సారాయి వ్యాపారం రాజ్యమేలుతోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. గిరిజన గ్రామాలు, తండాల్లో తెల్లవారుజాము నుంచే గుడుంబా తయారీ ప్రారంభమవుతూ అర్ధరాత్రి వరకు విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. చక్కెర, బెల్లం, ఇతర హానికర పదార్థాలతో తయారవుతున్న ఈ సారాయి యువతను మత్తులో ముంచి ప్రాణాలు తీస్తోంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న గ్రామాలు ఇప్పుడు శవయాత్రలకు సాక్ష్యంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ అక్రమ వ్యాపారానికి ఊతమిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**గుడుంబా మత్తులో యువత – తండ్రి లేకుండా ఎదుగుతున్న పిల్లలు**

గుడుంబా మత్తుకు బానిసైన యువకులు వరుసగా మరణిస్తుండటంతో మహబూబాబాద్ జిల్లా గ్రామాల్లో విషాదం నెలకొంది. 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల యువకులు ఎక్కువగా ఈ మత్తుకు బలవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కుటుంబానికి అండగా ఉండాల్సిన తండ్రులు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో చిన్నపిల్లలు అనాథలుగా మిగిలిపోతున్నారు. చదువుకోవాల్సిన వయసులో పిల్లలు పనుల కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దృశ్యాలు అధికారుల మనసును కదిలించడంలేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**తండాలలో జోరుగా గుడుంబా వ్యాపారం – ప్రజల్లో భయాందోళన.**

మహబూబాబాద్ జిల్లా నుంచి గుడుంబా వ్యాపారం వణికిస్తోంది. తండాలు, మారుమూల గ్రామాల్లో గుడుంబా తయారీ కేంద్రాలు బహిరంగంగానే నడుస్తున్నాయని ప్రజలు బహిరంగ చర్చల్లో చెబుతున్నారు. పోలీసుల దాడులు జరిగినా అవి తాత్కాలికంగానే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు వెళ్లిన కొద్ది రోజులకే మళ్లీ అదే దందా మొదలవుతోంది. ఇది నిర్లక్ష్యమా లేక అక్రమ వ్యాపారులకు అండగా నిలిచే వ్యవస్థా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి. తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి అదుపు తప్పుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**చక్కెర–బెల్లమే ఆయుధాలు – గుడుంబా మత్తులో పెరుగుతున్న మరణాలు.**

గుడుంబా తయారీలో వినియోగిస్తున్న చక్కెర, బెల్లం ఇప్పుడు అమాయకుల ప్రాణాలను తీసే ఆయుధాలుగా మారాయి. ఈ సారాయి తాగిన యువకులు వాంతులు, స్పృహ కోల్పోవడం, అకస్మాత్తుగా మరణించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఒకే నెలలో ఇద్దరు ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అయినా సంబంధిత శాఖలు తేలికపాటి చర్యలతో సరిపెడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడుంబా మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**గుడుంబా అరికట్టే నాధుడే లేడా? – ప్రజల గుండె చప్పుడు**

"గుడుంబాను అరికట్టే నాధుడే లేడా?" అనే ప్రశ్న మహబూబాబాద్ జిల్లా అంతటా మారుమోగుతోంది. మహిళలు, వృద్ధులు, గ్రామ పెద్దలు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడంలేదని వాపోతున్నారు. గుడుంబా వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నా పాలకుల స్పందన లేదన్న ఆవేదన ప్రజల్లో పెరుగుతోంది. ఈ మత్తు వ్యాపారం ఇలాగే కొనసాగితే గ్రామాల భవిష్యత్తే అంధకారమవుతుందని హెచ్చరిస్తున్నారు.


**ఇప్పటికైనా చెక్ పెట్టాలి – మహబూబాబాద్ ప్రజల హెచ్చరిక**

మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఇప్పుడు తేల్చిచెప్తున్నారు – గుడుంబాకు ఇప్పటికైనా పూర్తిగా చెక్ పెట్టాలి. రాజకీయ ఒత్తిడులను పక్కనపెట్టి, గుడుంబా తయారీ కేంద్రాలను శాశ్వతంగా మూసివేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజల ఆగ్రహం ఉద్యమంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గిరిజన గ్రామాలను మత్తు రహితంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**సారాయి మత్తు నీడలో మహిళల కన్నీళ్లు... పిల్లల కడుపు మంటలు**

గ్రామాల్లో విస్తరిస్తున్న సారాయి మత్తు మహిళల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తోంది. కుటుంబానికి అండగా ఉండాల్సిన భర్తలు సారాయి మత్తుకు బానిసలై రోజురోజుకు తమ ఆరోగ్యాన్ని, బాధ్యతలను కోల్పోతున్నారు. కొందరు ఆకస్మికంగా ప్రాణాలు విడుస్తుండగా, మరికొందరు అనారోగ్యంతో ఇంటికే పరిమితమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలపై కుటుంబ భారం మొత్తం పడుతోంది. సారాయి కోసం ఇంట్లో ఉన్న డబ్బును ఖర్చు చేయడం, అప్పులు చేయడం వల్ల మహిళలు ఆర్థికంగా నలిగిపోతున్నారు. కొన్నిచోట్ల మత్తులో భర్తలు చేసే హింసతో మహిళలు మానసికంగా, శారీరకంగా తీవ్రంగా బాధపడుతున్నారు. సారాయి మత్తు ప్రభావం పిల్లలపై మరింత ఘోరంగా పడుతోంది. తండ్రి మత్తులో ఉండటంతో ఇంట్లో శాంతి లేకుండా పోతోంది. చదువుపై దృష్టి పెట్టాల్సిన పిల్లలు కుటుంబ సమస్యల మధ్య నలిగిపోతున్నారు. కొందరు పాఠశాలలు మానేసి చిన్న వయసులోనే కూలి పనులకు వెళ్లాల్సి వస్తుండగా, మరికొందరు తండ్రిని కోల్పోయి అనాథలుగా మారుతున్నారు. పోషణ లోపం, భద్రతలేమి, మానసిక ఒత్తిడి పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఈ మత్తు మృత్యు చక్రానికి చెక్ పడకపోతే గ్రామాల భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సారాయి దందాను పూర్తిగా అరికట్టడంతో పాటు, మహిళలకు రక్షణ, పిల్లలకు విద్యా భరోసా, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే ఈ కన్నీళ్లకు ముగింపు సాధ్యమవుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

## రాజగోపాల్ రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం



**మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి. తదనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 200 కోట్ల నిధులు తెచ్చానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పడం అవాస్తమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు తెచ్చానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పడం అవాస్తమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.ఇక్కడ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.తన పాలనా కాలంలోనే ఈ ప్రాంతానికి అధిక నిధులు తెచ్చినట్లు ఆయన తెలిపారు.తేని నిధులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తానే తెచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఒకవేళ ఆయన నిధులు తీసుకొచ్చినది వాస్తవమే అయితే నిధుల జీఓ కాపీలను చూపించాలన్నారు .ఈ నిధులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు.గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన వంద పడకల దావఖాన,ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన పనులే ఉన్నాయని తెలిపారు.ప్రస్తుత ఎమ్మెల్యే ఇంతవరకు వాటి వైపు కూడా చూడడం లేదన్నారు.తన హయాంలోనే సీసీ రోడ్లు,డ్రైనేజీలు,వాటర్ ట్యాంకులు, స్మశాన వాటికలకు నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు.అయినా వాటి పనులు కొన్ని ఇంకా పూర్తి కాలేదని అగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా లక్కారం లోద్దికుంటకు మూసి జలాలను తరలిస్తానని గెలవగానే మాట ఇచ్చి తప్పాడన్నారు. రైతులు డబ్బులు వేసుకుని,దివిస్ పరిశ్రమ పైసలిస్తేనే ఎమ్మెల్యే పనులు ప్రారంభించడానికి ముందుకొచ్చారని ఆయన స్పష్టం చేశారు.ఇన్ని రోజులు ఈ పనులు ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు.ఫ్లై ఓవర్ పనులు ఆలస్యం అవ్వడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుమ్ము, దూలికి వ్యాపారాలు నడుపుకునే పరిస్థితి లేదన్నారు.ఈ మున్సిపాలిటీ మంచినీటి కోసం అమృత్ పథకంలో భాగంగా రూ.25 కోట్ల నిధులు తన హయాంలో తెచ్చిన ట్యాంకుల నిర్మాణం పూర్తి కాలేదు అన్నారు. అంతేగాకుండా బెల్ట్ దుకాణాల బంద్ మాటలకే పరిమితమైందన్నారు.రాష్ట్రంలో ఒకలా ఎక్సైజ్ పాలసీ ఉంటే మునుగోడులో ఇంకోలా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు క్రికెట్ నిరంజన్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలం సింగరాజుపల్లి గ్రామంలో జడ్. పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో 26 జనవరి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆటల పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరాజుపల్లి గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం దేశానికి స్వేచ్ఛ సమానత్వం ఐక్యతను గుర్తించే మహత్తరమైన పర్వదినం అని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ శరీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, సూచించారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ప్రతిభావంతులను వెలికి తీయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు అనిల్ వార్డు సభ్యులు పాల్గొని, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఆటల పోటీల్లో గ్రామానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ పోటీలు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని స్నేహభావాన్ని పెంపొందిస్తాయ ని తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి వేణు, కొండ అఖిల్, కొండ చిన్న బుచ్చిరెడ్డి, నల్ల యాదగిరి, జోగు శ్రీశైలం, రాపాక శ్రీశైలం, యూత్ అధ్యక్షులు జోగు సోమరాజు, నల్లపు బుచ్చి రాములు, ఉదయ్, రచ్చ చందు, దాకూరి భాస్కర్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యా నిర్వీజ్ఞ ఫౌండేషన్ భరోసా



**మునుగోడు, విశాలభారతి:** విద్యా నిర్వీజ్ఞ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటీవల అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స (సర్జరీ) చేయించుకుని, ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న రడం మని కుమార్ జడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణ వెల్లంల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థికి ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆ విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వారికి నిత్యావసర సరుకులను ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. విద్యార్థి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యా నిర్వీజ్ఞ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోల్గురి ముకేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న విద్యార్థులను ఆదుకోవడం తమ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చదువుకునే పిల్లలు ఆరోగ్య సమస్యల వల్ల ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రాకేష్, ట్రెజరర్ జగదీశ్, సభ్యులు గాదె రాజు, బొడ్డుపల్లి రాజు, గ్రామ 7వ వార్డ్ మెంబర్ బోల్గురి ఉపేదర్, మహేందర్ గాదె శివరాజ్ తదితరులు పాల్గొని విద్యార్థి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## కురవి పెద్దమాలకు సన్మానం



**మహబూబాబాద్, విశాలభారతి:** కురవి మేజర్ గ్రామపంచాయతీ మాల కుల పెద్ద మనిషిగా ఎన్నికైన కామిండ్ల వెంకటేశ్వర్లు మాల, సారకొల మాల మండల రామచంద్రయ్య, మాల జవాను గా దుంద్ర ఉప్పలయ్య లను నూతనంగా ఎన్నికైన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేతమల్ల సహదేవ్, మాల జర్నలిస్టుల జిల్లా కౌన్సిల్ సభ్యులు గండమల్ల రోశయ్య, మాల జర్నలిస్టుల సంఘం సభ్యులు కమటం నాగేశ్వరరావు, మాల కమిటీ సభ్యులు గాజుల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రుని పరామర్శించిన నూతక్కి సాంబశివరావు



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామపంచాయతీకి చెందిన తెలంగాణ మాల మహానాడు సంఘం, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు కలగూర నాగరాజు తండ్రి కలగూర రామచంద్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి చికిత్స పొందిన ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా గురువారం కురవి మేజర్ గ్రామ పంచాయతీ సీనియర్ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, టియుడబ్ల్యూజె (ఐజేయు) దాడుల నియంత్రణ కమిటీ కో కన్వీనర్ బేతమల్ల సహదేవ్ లు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిరియాల శ్రీనివాస్, ఎన్ పి ఆర్ డి జిల్లా నాయకులు ఎస్ డి ఖాజా, జర్నలిస్టులు గండమల్ల రోశయ్య, కమటం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## హెల్మెంట్ తప్పనిసరి: డీఎస్పీ రవీందర్ రెడ్డి



**విశాలభారతి, కరకగూడెం:** మండలం రోడ్డు మీదకు వెళ్లేటప్పుడు బైక్ వాహనదారులు, కారు డ్రైవర్లు, సీట్ బెల్ట్ తో పాటు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి కరకగూడెం లో నిర్వహించిన భద్రత అవగాహన సదస్సులో వివరించారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**మొయినాబాద్, విశాలభారతి:** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి గురువారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న వివిధ రెవెన్యూ సంబంధిత పనుల పురోగతిని సమీక్షించారు. మొయినాబాద్ మండలానికి సంబంధించిన భూభారతి పెండెన్సీని త్వరితగతిన క్లియర్ చేయాలని, అలాగే మీసేవ ఎస్ఎల్ఏ గడువు దాటిన పెండింగ్ కేసులు, ఎఫ్లైన్ పిటిషన్లను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అక్రమ ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను సకాలంలో తీర్చేందుకు కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని, వారికి కేటాయించిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో జీపీఎస్‌లు కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి పెండెన్సీ లేకుండా కేసులను క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ ద్వారా రెవెన్యూ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యమని అదనపు కలెక్టర్ తెలిపారు.

# నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



**విశాలభారతి, రామగుండం:** రామగుండం జడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న నూతన భవనం నిర్మాణం, స్కూల్ కిచెన్-డైనింగ్ హాల్, అదేవిధంగా అడిటోరియం మరియు ప్లే గ్రౌండ్‌లో రన్నింగ్ ట్రాక్ పనులను గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధితో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 27వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అమ్రిన్ ఫాతిమా సలీం బేగ్ గారు, పాఠశాల సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌ని కలిసిన బీసీ సంఘం నాయకులు



**మునుగోడు, విశాలభారతి:** మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాదులో గురువారం రోజున బిసి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ గౌడ్,రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కారుల కుటుంబాలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని వారు కోరారు. చెరువులో చేపలు పట్టడానికి బోటు సౌకర్యం కల్పించాలని , ఐస్ బాక్సులు మరియు వాహనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.చెరువులో సరైన సౌకర్యాలు లేక పోవడం,చెరువులని పుణరుద్ధన చేయకపోవడం వలన చేపల రాబడి తక్కువగా వస్తున్నది. కాబట్టి చెరువులను వెంటనే పునరుద్ధరించాలని వారు కోరారు .అదేవిధంగా కొన్ని గ్రామాలలో మత్స్య సొసైటీ లేక మత్స్య కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు .వారికి వెంటనే సొసైటీలను ఏర్పాటు చేయాలని కోరారు .తెలంగాణలో భూముల ధరలు విపరీతంగా పెరిగినందున చెరువులు,కుంటలు కబ్జాలకు గురికావడం జరిగింది .కబ్జా కారుల చేతిలో ఉన్నటువంటి భూమిని వెంటనే విముక్తి చేయాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ స్పందిస్తూ వీటిపై త్వరలో నివేదిక తెప్పించుకొని శాశ్వత పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని వారు తెలియజేశారు.

# దళితుల భూములను ప్రభుత్వ కార్యాలయాల పేరిట లాక్కోవద్దు

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి.**



**కురవి, విశాలభారతి:** దళితులకు ఇందిరమ్మ ఇచ్చిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం పేరిట ప్రజా ప్రభుత్వం లాక్కోవద్దని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. గురువారం కురవి మండల కేంద్రంలో దళితులకు చెందిన భూమిని సిపిఐ బృందం పరిశీలన చేసి ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.., గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదిక, పల్లె ప్రకృతి వనాల పేరిట దళితులకు ఇందిరమ్మ ఇచ్చిన భూములను లాక్కోవడం జరిగిందని, నిర్మాణాలు జరగగా మిగిలి ఉన్న భూమిని ఈ ప్రభుత్వం కూడా లాక్కోవడానికి ప్రయత్నాలు చేయడాన్ని వెంటనే ఆపివేయాలని, అట్టి భూమిని పేద దళిత కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం ఇంటి స్థలాలుగా ఇచ్చి, ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య బుడమ వెంకన్న దూది కట్ల సారయ్య, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, విజయ్, అనిల్, భద్రకాళి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

- మొయినాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల వెంటనే ఏర్పాటు చేయాలి
- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**మొయినాబాద్, విశాలభారతి:** సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో సీపీఎం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో మొయినాబాద్ పురపాలక సంఘంలో పోటీ చేస్తున్న సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని, మొయినాబాద్ పురపాలక సంఘ ప్రజలకు, కార్మికులకు, కర్షకులకు పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, అజీజ్ నగర్ లో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చేంతవరకు నిర్విరామంగా పోరాటం చేసి పేదలకు డబుల్ బెడ్రూం ఇప్పించామని అన్నారు. మొయినాబాద్ పురపాలక సంఘంలో అనేక వార్డులలో రోడ్లు పూర్తిగా ధ్వంసం ప్రస్తుత పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. హైదరాబాద్ కు కుతవేటు దూరంలో ఉన్న మొయినాబాద్ ప్రాంతంలో కనీసం బస్టాండ్ లేదని, పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేవని అన్నారు. ఈ ప్రాంత పాలకులు మొయినాబాద్ ప్రాంతా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సీ.హెచ్.ప్రవీణ్ కుమార్, సీపీఎం మొయినాబాద్ మున్సిపల్ నాయకులు దప్పు మహేందర్, ముంజగళ్ళ ప్రభుదాస్, తాళ్లపల్లి శ్రీనివాస్ ఆంగోత్ రాజు, ముంజగళ్ళ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో 40 కేజీల ఎండు గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో నిందితులు
- రూటు మార్చిన గంజాయి స్మగ్లర్స్
- మహిళలతో గుట్టుగా నిషేధిత గంజాయి వ్యాపారం
- గుట్టురట్టుచేసిన పోలీసులు

**పాల్వంచ, విశాలభారతి:**



భారీగా గంజాయి తరలిస్తున్న ముఠాను పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి 40 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడ్డ నిందితులలో ఒక యువకుడు నలుగురు. మహిళలు ఉండడంతో గంజాయి స్మగ్లర్ రూట్ మార్చినట్టుగా తెలుస్తుంది. మహిళలను టార్గెట్ చేస్తూ మహిళలతో గుట్టుగా వ్యాపారం చేస్తున్నట్టు. తెలుస్తుంది. ఆ వివరాల్లోకెళ్తే భద్రాచలం నుండి చెన్నైకి గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పాల్వంచ పోలీసులు పాల్వంచ బస్టాండ్ లో మాటు వేసి పట్టుకున్నట్లు సమాచారం. పట్టుబడ్డ నిందితులలో ఒక యువకుడు నలుగురు మహిళలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా భద్రాచలం నుండి. 40 కేజీల ఎండు గంజాయిని చెన్నైకి డెలివరీ ఇచ్చేందుకు తరలిస్తున్నట్లుగా సమాచారం. సుమారు పట్టుకున్న గంజాయి విలువ 40 లక్షలు వుంటుందని. అంచనా పూర్తి వివరాలు తెలియవలసింది.దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# లచ్చన్నగూడెం ఐకెపి కొనుగోలు కేంద్రంలో రైతులకు చుక్కెదురు



- తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా
- క్వింటాకు 14 కిలోల కటింగ్‌తో రైతులకు భారీ నష్టం
- బోనస్‌తో కలిపి సుమారు రూ.30 లక్షల నష్టం జరిగినట్టు ఆరోపణ
- మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్

**సత్తుపల్లి, విశాలభారతి:**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. గత ఏడాది సారవ వరి పంటను ఈ కేంద్రంలో అమ్మిన రైతులు మిల్లర్ల మోసానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి చెందిన సహస్ర రైస్ మిల్లు, అరుణాచల శివ రైస్ మిల్లు యాజమాన్యాలు క్వింటా ధాన్యానికి 14 కిలోల చొప్పున అక్రమంగా కటింగ్ చేసి, ట్రక్ షీట్లలో తక్కువ బరువుగా నమోదు చేసి పంపించాయని రైతులు ఆరోపించారు. ట్రక్ షీట్లలో నమోదు చేసిన బరువుకు మాత్రమే చెల్లింపులు జమ కావడంతో మొత్తం 24 మంది రైతులు నష్టపోయినట్లు తెలిపారు. బోనస్‌తో కలిపి సుమారు రూ.30 లక్షల వరకు నష్టం జరిగిందని నిర్ధారణకు వచ్చిన రైతులు గురువారం మిల్లర్ల దగాతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నాయబ్ తహశీల్దార్ బంతిరాంకు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రేడ్ ఏ ధాన్యమని ఐకెపి సిబ్బంది నమోదు చేసినప్పటికీ మిల్లర్లు ఎలా కటింగ్ విధించారో అర్థం కావడం లేదని రైతులు ప్రశ్నించారు. ట్రక్ షీట్లలో ఐకెపి సిబ్బంది రాసిన బస్తాల సంఖ్య, క్వింటాళ్లను మిల్లర్లు కొట్టి వేసి తక్కువగా నమోదు చేసి సంతకాలు, ముద్రలు ఎలా వేస్తారని నాయబ్ తహశీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్‌తో పాటు బాధిత రైతులు ఇమ్మడి మల్లేశ్వరరావు, నాయుడు శ్రీనివాసరావు, బోయినపల్లి సత్యనారాయణ, రాయల నరసింహారావు, ఇమ్మడి శంకర్ రావు, అన్నపురెడ్డి కృష్ణయ్య, పతేపరుపు అంజారావు, హనుమంతరావు, మాణికల రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

**కొత్తగూడెం: విశాలభారతి:**

హత్య కేసులో జీవిత ఖైదీ విధిస్తూ కొత్తగూడెం ప్రధాన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు కు చెందిన మహమ్మద్ మహబూబ్ బాష 25 ఆగస్టు 8 న తాను మణుగూరు పోలీస్ వారికి ఇచ్చిన ఫిర్యాదు లో తనతో కలిసి నలుగురు అన్నదమ్ములు ముగ్గురు అక్క చెల్లెళ్ల మీద తన తల్లి ఏం.డి.లాల్ బీ తమ పేరు మీద 12 సంవత్సరంల క్రితం డబ్బులు ఫిక్స్ డిపాజిట్ చేసినద ని అవి అన్నదమ్ము లందరూ సమానంగా పంచుకోమని చెప్పగా హామీ ఇచ్చాను. అని ఫిక్స్ డిపాజిట్ ను రద్దు చేసి డబ్బులు తీసుకోగా 8 లక్షలు రాగా అట్టి డబ్బులు నలుగురం అన్నదమ్ముల పంచుకుందామని మా మూడవ అన్న మహమ్మద్ ఇబ్రహీం సుందరయ్య నగర్ మణుగూరు కు చెందిన మా అన్న మహమ్మద్ ఇబ్రహీం మాపై గొడవ చేస్తూ డబ్బులు నాకు సగం రావాలని నా ఒక్కని కే సగం వాటా ఇవ్వలేదని గొడవ పడ్డాడు అప్పటినుండి మూడవ అన్న మహమ్మద్ ఇబ్రహీం మాపై కక్ష పెంచుకొని మమ్మల్ని చంపుతానని బెదిరించే వాడు. పార్టీ డబ్బులు సగం ఇవ్వలేదని తనతో తన భార్యతో గొడవ పడినాడని వారి అంతు చూస్తామని మిమ్మల్ని భూమి మీద బతకానివ్వనని బెదిరించేవాడని సుమారు వారం రోజుల క్రితం కూడా ఇబ్రహీం తన ఇంటి దగ్గరికి వచ్చి బెదిరించాడని తన భార్య హబీబిబి ప్రతి ఈరోజు ఉదయం నీటి పంపు దగ్గరికి వెళ్లి నీళ్లు తీసుకొని వస్తుందని అలాగే 2020 ఆగస్టు 8 న ఉదయం 7:30 కు నీటి కొరకు వెళుచుండ గా వెనుక నుండి మహమ్మద్ ఇబ్రహీం వచ్చి పొడవైన కత్తితో మెడమీద నరికి పారిపోయినాడు.చుట్టుపక్కల వారు 108 ను పిలిపించ గా వచ్చి పరీక్షించగా అక్కడే తన భార్య చనిపోయినదని ఏం.డి.ఇబ్రహీం కు సగం డబ్బులు ఇవ్వలేదని కక్ష పెంచుకొని కిరాతకంగా చంపాడని తగిన చర్య తీసుకోమని మణుగూరు పోలీసు వారికి ఫిర్యాదు చేయగా అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం .ఏ. షూకూర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారని, మరియు అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. భాను ప్రకాష్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 15 మంది సాక్షులను విచారించారు. మహమ్మద్ ఇబ్రహీం పై నేరాభియోగము రుజువు అయినదని కోర్టు భావించి జీవిత ఖైదు మరియు రూ .1,000/ జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పి.వి.డి. లక్ష్మి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ప్రస్తుత మణుగూరు ఎస్. హెచ్. ఓ. పి. నాగబాబు కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్ .వీరబాబు,( కోర్టు డ్యూటీ ఆఫీసర్ )పిసి ఎం. అశోక్ లు సహకరించారు.

# రూ.20 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్ర నగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని మెహఫిల్ బ్యాక్ సైడ్ ప్రాంతం - మైలర్ దేవ్ పల్లి మెయిన్ విల్లేజ్ పరిసరాల్లో అభివృద్ధి పనులలో భాగంగా దాదాపు రూ.20 లక్షల వ్యయంతో నూతన భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పైప్ లైన్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎమ్డబ్ల్యూఎస్ అండ్ ఎస్ బి అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, సకాలంలో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ మరియు ఎస్ బి డీజీఎం ఖదీర్ లోకనాథ్, స్థానిక బస్తీ నాయకులు పిల్లి శేఖర్ యాదవ్, కుంబ యాదయ్య, జగన్ యాదవ్, అయిటి పాముల మల్లిఖార్జున్, అయిటి పాముల దయానంద్, రామిడి మధుసూదన్ రెడ్డి, ఎన్ని శంకర్ రెడ్డి, గుమ్మడి రవీందర్ రెడ్డి, కే.ఎన్. ఉమామహేశ్వర్ జీ, కే.ఎన్. దయానంద్ జీ, మజర్ బాయ్, అలాగే జిహెచ్ఎంసి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



# ఎర్రజెండా యోధుడికి చివరి విప్లవ జోహార్లు!



**మహబూబాబాద్, విశాలభారతి:** సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ సభ్యులు, బయ్యారం మండలం గౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని కోడిపుంజుల తండాకు చెందిన ధారావత్ హచ్యా గత రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హచ్యా మృతదేహంపై సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలయ్య, జిల్లా నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నివాళుల కార్యక్రమంలో మాట్లాడిన కామ్రేడ్ ఐలయ్య..., ధారావత్ హచ్యా సుదీర్ఘకాలంగా పార్టీ కార్యకర్తగా కొనసాగుతూ, ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుండేవారని అన్నారు. అమరుడు కామ్రేడ్ సురేష్ అన్నకు ఆశ్రయం కల్పించి, ఆయన అనుచరుడిగా గ్రామ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. వికలాంగుడైనప్పటికీ హచ్యా ప్రజలందరినీ సమన్వయం చేసి నాయకత్వం వహించారని, నిర్బంధ కాలంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని పార్టీ వెనకాల దృఢంగా నిలబడ్డారని తెలిపారు. ఆయన మృతి కోడిపుంజుల తండా గ్రామానికి, అలాగే సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరారం మాజీ సర్పంచులు చింతా వెంకన్న, బోడ శంకర్, పార్టీ నాయకులు దేశెట్టి రవి, కొదుమూరి నాగేశ్వరరావు, కొమరెల్లి సోమిరెడ్డి, గూడూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా హేమ సుదర్శన్ జిల్లోజు




**ముషీరాబాద్,విశాలభారతి:** ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా హేమా సుదర్శన్ జిల్లోజు నియమితులయ్యారు. మూడు రోజులపాటు తెలంగాణ పర్యటనకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ ముఖ్య అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పార్టీలు అవినీతి అక్రమాలు ప్రజాధనా దోపిడి వల్ల పాలన పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించారు. పాలకులకు ప్రజల బాధలు పట్టడం లేదని మున్సిపాలిటీలు అవినీతికి అడ్డగా మారాయన్నారు. ఈ దుర్భర పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా నిజాయితీ పారదర్శకత ప్రజా కేంద్రీక పాలన తీసుకురావడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల బరిలో దిగుతుందని తెలిపారు. వర్కింగ్ కన్వీనర్ గా బుర్ర రాము గౌడ్, కో కన్వీనర్ గా శైలు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎస్ కే ఆర్ అన్సారి, ట్రెజరర్ మమ్మద్ సోహెల్, జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్, జాయింట్ ట్రెజరర్ జావిద్ షరీఫ్ నియమితులయ్యారు.

# ధర్మ రక్షణ సభకు సంపూర్ణ మద్దతు

- ఉప్పల్ హిందూ న్యాయవాదుల జేఏసీ
- నరేష్ కుమార్ నర్సింగోజు



**మేడిపల్లి, విశాలభారతి:** బంగ్లాదేశ్ మరియు రోహింగ్యా ముస్లిం చొరబాటుదారులను అరెస్టు చేసి తిప్పి పంపాలని నిర్వహించబోయే చలో బాలాపూర్ కార్యక్రమంకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు హిందూ న్యాయవాదుల జేఏసీ నాయకుడు నరేష్ కుమార్ నర్సింగోజు తెలిపాడు.మేడిపల్లి లోని ఉప్పల్ కోర్టు ప్రాంగణంలో హిందూ న్యాయవాది నర్సింగోజు నరేష్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు, నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులు మరియు రోహింగ్యాల ప్రవేశం దేశ భద్రతకు, స్థానిక ప్రజల ఉపాధికి, సామాజిక శాంతి మరియు సామరస్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్రమంగా ప్రవేశించిన వారిని గుర్తించి వెంటనే దేశం నుంచి పంపించాలనీ,సరిహద్దు భద్రతను మరింత కఠినతరం చేయాలనీ డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇప్పటికే భాగ్యనగరంలో (హైదరాబాద్‌లో) అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ మరియు రోహింగ్యాలను గుర్తించి, వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు శ్రీకాంతుడు,బజారు కిరణ్ గౌడ్, ఆలే నరేంద్ర, వెంకట్ రెడ్డి,వెంకటరాములు, శాగంటి రవి పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరించిన తుంగతుర్తి రవి



**మేడిపల్లి, విశాలభారతి:** నూతన సంవత్సర 2026 ప్రజా సాక్షి దినపత్రిక క్యాలెండర్ను బోడుప్పల్ సర్కిల్ పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి వారి కార్యాలయంలో గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవ సమాజ నిర్మాణంలో జర్నలిస్టులది కీలక పాత్ర అని ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యపాత్ర వహిస్తారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా సాక్షి దినపత్రిక నిజాలు నిర్భయంగా రాయడంలోముందుంటుందని ఆయన కొనియాడారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జర్నలిస్టులు గోడిశాల సోమయ్య, రాజపేట నవీన్ చారి, జిఎం కిషోర్, జిల్లాల బుచ్చిరెడ్డి, ఉదయ్, వెంకట్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 25 నుంచి 28 వరకు మహాసభలు

- విజయవంతం కావాలని ఎమ్మెల్యే మట్టా రాగమే ఆకాంక్ష
- ఐద్వా 14వ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- మహిళా హక్కుల సాధనకు ఐద్వా కీలక పాత్ర
- మహిళల అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని హామీ




**సత్తుపల్లి , విశాలభారతి:** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల పోస్టర్‌ను సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమే ఆవిష్కరించారు. హైదరాబాద్ నగరంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఐద్వా జాతీయ మహాసభలు విజయవంతంగా జరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ, మహిళా హక్కుల సాధన కోసం ఐద్వా నిరంతరం చేస్తున్న పోరాటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించనున్న ఈ జాతీయ మహాసభలు మహిళా ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చాలని తెలిపారు. మహిళల అభివృద్ధి, సంక్షేమానికి తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ ట్రెజరర్ మాచర్ల భారతి, రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం కరుణ, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు చెరకు రత్నకుమారి, కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, జాజిరి జ్యోతి, మిట్టపల్లి నాగమణి, పుష్పవల్లి, పాకలపాటి ఝాన్సీ రాణి, రుద్రమ తదితర మహిళలు పాల్గొన్నారు.

## చిన్న రావిరాల గ్రామంలో నూతన పాలకవర్గ సమావేశం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** చిన్న రావిరాల గ్రామ సర్పంచ్ పబ్బతి బాల కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, విద్యుత్, తాగునీటి సమస్యలపై విస్తృతంగా చర్చించారు.గ్రామ ప్రజలకు నిత్యావసరమైన సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సర్పంచ్ బాలకిషన్ గౌడ్ తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న ఇతర సమస్యలను ఒక్కొక్కటిగా చర్చించి తగిన పరిష్కారాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, అబ్బావతి బాలయ్య, నారెడ్డి రిషితసతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెర్కు భాగ్యలక్ష్మి, గ్రామ సెక్రెటరీ సునీత గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి కాడెద్దు మృతి



**కొడంగల్, విశాలభారతి:** మండలానికి సమీపంలో ఉన్న ఈర్లపల్లి గ్రామంలో గురువారం ఈ విషాదం జరిగింది. బిచ్చల నారాయణ వ్యవసాయ పొలంలో కాడెద్దులతో పొలం పనులు చేస్తుండగా కరెంట్ ట్రాన్స్ఫార్మర్ దగ్గర హార్త్ తగిలి ఒక ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఎద్దు విలువ దాదాపు 65 వెల వరకు ఉంటుందని రైతు తెలుపాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఎంపీ ఈటల రాజేందర్ సారధ్యంలో మల్కాజ్గిరి అభివృద్ధిలో ఆదర్శం

- 80.47 కోట్ల నిధులను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- వాజ్పేయి నగర్, నేరేడ్ మెట్, సఫిల్ గూడ ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



**మేడిపల్లి, విశాలభారతి:** మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలోని పలు రైల్వే అభివృద్ధి పనుల కోసం సుమారు 80.47 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో వాటిపై నగర్లో 70.47 కోట్ల రూపాయలతో రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణం, సఫిల్ గూడ లో లిమిటెడ్ హైట్ సబ్వే నిర్మాణానికి 6 కోట్లు కేటాయించారు. బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ ఈస్ట్ జోన్ బిజెపి ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ స్పందిస్తూ దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్గిరి పరిధిలో ఎంపీ ఈటల రాజేందర్ సారధ్యంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈటల రాజేందర్ చొరవతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 80 కోట్ల నిధులతో అనేక రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభించడం హర్షనీయమని, ఈ పనులు పూర్తయితే దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అంతేకాకుండా రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద జరిగే ప్రమాదాలను అరికట్టవచ్చు. నేరేడ్ మెట్ , సఫిల్ గూడ, వాజ్పేయి నగర్ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగుపడి, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం ఈటెల రాజేందర్ నాయకత్వంలో ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతుందని తుప్పత్ ఆనంద్ ఆశాభవం వ్యక్తం చేశారు.

## నందివనపర్తిలో వసంత పంచమి వేడుకలు.. సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసాలు

- వసంత పంచమికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తిలో గ్రామీణ విద్యార్థుల వికాసం కోసం జ్ఞానసరస్వతీ దేవాలయం నిర్మితమైంది. ఆయలం పూర్తిగా విద్యార్థుల భాగస్వామ్యంతోనే నిర్మించడం విశేషం. జిల్లాలోనే సరస్వతీ మందిరాలు అరుదు కావటంతో ఈ ఆలయం అనతి కాలంలోనే అత్యంత ఆదరణకు నోచుకుంది. నేడు చదువుల తల్లి సరస్వతి పుట్టినరోజు పర్వదినంను పురస్కరించుకొని ప్రతి ఏడాది వసంతపంచమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనికోసం ఇప్పట్టికే ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. హంపీ పిఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామీజీ ఆలయంలో ప్రత్యేకపూజలు, అర్చనలు, సరస్వతీ హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించనున్నారు. దీనికోసం బాసరకు వెళ్లలేని భక్తులంత నందివనపర్తిలో అక్షరాభ్యాసం చేయించి, ప్రత్యేకపూజలు చేసి, మొక్కులు తీర్చుకుంటారు. మరో బాసరగా నందివనపర్తి జ్ఞాన సరస్వతి అమ్మవారు విరాజిల్లుతుంది.

**అక్షరాభ్యాసానికి కావాలల్సినవి**

అక్షరాభ్యాసానికి కావాలల్సిన పలక, బలపం, అమ్మవారి ఫొటో, ప్రసాదం ఆలయ కమిటీ అందజేస్తుంది. చిన్నారుల తల్లితండ్రులు తమలపాకులు, పూలు, పండ్లు, కుడక, 1.25 కేజీల బియ్యం, పసుపు, కుంకుమ వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి పాఠశాల విద్యార్థులచే శ్రీ సరస్వతి హోమం ఉంటుంది. రాత్రి ఏడు గంటల నుంచి పదో తరగతి విద్యార్థులతో అమ్మవారి పల్లకి సేవ ఉంటుంది. అక్షరాభ్యాసం చేయించుకునే చిన్నారులు ఉదయం ఎనిమిది గంటల లోపే ఆలయానికి చేరుకోవాలని ఆలయ ధర్మకర్త సదా వెంకట్ తెలిపారు.

# విద్యార్థులే రోడ్డు భద్రతకు భవిష్యత్ దూతలు

- మైనర్లు బండి నడపడం నేరం.. తల్లిదండ్రులు శిక్షార్హులే
- ఒక్క ప్రమాదం ఎన్నో కుటుంబాలకు తీరని శోకం
- చిన్నారులు రోడ్లను ఆట స్థలంగా మారిస్తే ప్రమాదం
- భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య
- టిజిఎంఆర్ఎస్ & జెసి భద్రాచలం బాయ్స్ - 1లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన




**భద్రాచలం, విశాలభారతి:** రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా టీజీఎంఆర్ఎస్ అండ్ జెసి భద్రాచలం బాయ్స్ 1లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమేనని స్పష్టం చేశారు. పిల్లలు రోడ్లపై నడిచేటప్పుడు,సైకిళ్ళు తొక్కేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, ఆట స్థలంగా మార్చి రోడ్లపై ఇష్టమొచ్చినట్టు ఆడుకోవడం చేయరాదని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా విలువైన ప్రాణాలను కోల్పోయే పరిస్థితికి దారి తీస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. “ఈరోజు మీరు నేర్చుకున్న భద్రతా నియమాలే రేపటి ప్రమాదాల నివారణకు ఆయుధాలు” అని అన్నారు. దేశంలో ప్రతి రోజు వందలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, అందులో ఎక్కువ శాతం యువతే ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను లెక్కచేయకుండా వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలే ప్రధాన కారణాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం ఒక క్షణంలో జరుగుతుంది కానీ దాని బాధ కుటుంబాన్ని జీవితాంతం వెంటాడుతుందని ఆయన భావోద్వేగంగా వివరించారు. “మన కోసం ఎదురుచూసే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉన్నారని ప్రతి యువకుడు గుర్తుంచుకోవాలి. రోడ్డు మీద నిబంధనలు పాటించడమే నిజమైన బాధ్యత” అని అన్నారు .అనంతరం భద్రాచలం ఏఎంవీఐలు ఫారూక్, రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ అనివార్యమని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య స్పష్టమైన సమాధానాలు ఇచ్చి, రోడ్డు భద్రతపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల్లో చైతన్యం పెరిగేలా ఉదాహరణలతో వివరించడం విశేషంగా నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజసమ్మయ్య మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల జీవితాల్లో కీలక మార్పుకు దోహద పడతాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిన విద్యార్థులే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా మారతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిద్దెల రవి, రాంబాబు, సిబ్బంది, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ పాల్గొని రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడంలో తమ వంతు పాత్ర పోషించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ప్రభుత్వ గురుకులాలలో మెరుగైన విద్య




- తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ
- నందివనపర్తి గ్రామంలో గురుకుల పాఠశాలపై ర్యాలీ నిర్వహణ

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ గురుకుల పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేద విద్యార్థులందరూ వసతి గృహాల్లో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ పేర్కొన్నారు.గురువారం యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో టిజిసిఈటి అడ్మిషన్ల అవగాహన కార్యక్రమం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ జాయింట్ సెక్రెటరీ బి సక్రు నాయక్, రాష్ట్ర అధికారి కె.నిర్మల, నల్ల కంచె ప్రిన్సిపల్ లీలావతి, కందుకూరు ప్రిన్సిపల్ బి. రామయ్య, శంషాబాద్ ప్రిన్సిపల్ పి నాగేశ్వరరావు, ఇబ్రహీంపట్నం వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ యాదయ్య కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఝాన్సీ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ,ఎస్టీ, బీసీ మైనార్టీ జనరల్ గురుకులాలు 123 ఉన్నాయని వీటిలో ప్రతి సంవత్సరం 55 వేల వరకు 5వ తరగతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నారు. మైనార్టీ గురుకులం తప్ప మిగతా వాటిని 25 జనవరి 2026 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని అర్హులైన విద్యార్థులు అందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకులంలో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు ఖాళీలు ఉన్నాయని వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. టిజిఎస్ఆర్డబ్ల్యూ ఈఐఎస్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ ,ఉపసర్పంచ్ జనీగే శ్రీశైలం ఆధ్వర్యంలో గురుకుల దరఖాస్తుల విషయంలపై అవగాహన కల్పించారు. రెండు గ్రామాలలో ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి చైతన్యపరిచారు.

## టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా హెచ్. వెంకటేశ్వరరావు

- రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అధికారిక ప్రకటన
- 28 ఏళ్ల ఉద్యమ సేవలకు గుర్తింపు
- ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో 28 ఏళ్లుగా చురుకైన పాత్ర
- రాష్ట్ర కమిటీ పిలుపుకు ముందుండి కార్యచరణ నిర్వహించిన నాయకుడు
- ఎస్సీ–ఎస్టీ–బీసీ–మైనారిటీ హక్కుల కోసం నిరంతర పోరాటం




**సత్తుపల్లి, విశాలభారతి:** టీ ఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు, ఎల్.వి.ఆర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఖమ్మం జిల్లా టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా హెచ్. వెంకటేశ్వరరావును నియమించారు. సత్తుపల్లి నియోజకవర్గం కాకర్లపల్లి గ్రామానికి చెందిన హెచ్. వెంకటేశ్వరరావు, టీఎస్ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ గత 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన ప్రతి కార్యచరణను ముందుండి నడిపిస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేసిన వ్యక్తిగా ఆయనకు పేరుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల కోసం పోరాడుతూ సంఘాన్ని క్రమబద్ధంగా ముందుకు తీసుకెళ్లడంలో హెచ్. వెంకటేశ్వరరావు కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు, ఎల్.వి.ఆర్ మాదిగ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అలాగే పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి మేళ్లచెరువు నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి హెచ్. హరీష్ మాదిగ, వేంసూరు మండల అధ్యక్షులు మేకల వెంకటేశ్వర్లు, కల్లూరు మండల అధ్యక్షులు వేల్పుల జానీ, ఖమ్మం జిల్లా నాయకులు పొట్ట పింజర వెంకటరత్నం, ముదిగొండ మండల అధ్యక్షులు కొత్తపల్లి నరసింహ, విద్యార్థి సంఘ అధ్యక్షులు కర్ష ఉపేందర్, మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి, కురి నరసింహ, చింతకాని మండల అధ్యక్షులు సింగారపు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుపై నిరసన



రాజేంద్రనగర్, విశాలభారతి: రాజేంద్రనగర్‌లో మహిళల స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించే ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయంగా మార్చడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భవనంలో రోజూ మహిళల గ్రూప్ కార్యకలాపాలు కొనసాగుతాయని, సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటైతే మహిళల భద్రతకు ముప్పుతో పాటు వారి కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళలు భవనం ఎదుట ధర్నాకు దిగారు. సబ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పరికరాలను బయటకు తీసి నిరసన తెలిపారు. ఈ ఘటనపై సబ్ రిజిస్టర్ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాట్‌మెంట్ అయిన కార్యాలయాన్ని అడ్డుకోవద్దని అధికారులు మహిళలను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే మరింత తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని మహిళలు హెచ్చరించారు.

## ఎన్నికల బరిలో ఆకుల పూర్ణిమ అరుణ్




**విశాలభారతి, గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ అతి సన్నిహితుడుగా ఉంటూ, వారి మార్గనిర్దేశంలో ప్రాంత అభివృద్ధి కోసం ఎప్పుడూ ముందు ఉంటూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 39 వ డివిజన్ తనకు కుటుంబం లాంటిది అని. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండటమే తన జీవన విధానం అని 39 వ డివిజన్ అభ్యర్థి ఆకుల పూర్ణిమ అరుణ్ అన్నారు. మాటలకే పరిమితం కాకుండా సేవే తన రాజకీయ పునాది అని ఆకుల పూర్ణిమ అరుణ్ పేర్కొన్నారు. డివిజన్లో మౌలిక సదుపాయాలు కల్పించడం తాగునీటి సమస్యలు డివిజన్లో డ్రైనేజీ రోడ్ల అభివృద్ధి మహిళ సంక్షేమ అభివృద్ధి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే అభివృద్ధిలో మహిళలకు యువతకు అవకాశాలు కల్పించడం. పేదల సమస్యపై తక్షణ స్పందిస్తానని స్పష్టం చేశారు. డివిజన్లో ఏ సమస్య తలెత్తిన ప్రజల దగ్గరికి వెళ్లి సమస్య విని పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని తెలిపారు.ఎవరైనా సహాయం అడిగితే లేదనకుండా చేయూతనిచ్చే మనసుతో, ప్రజలకు సేవనే నా లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాము. అని తెలియజేసారు. వృద్ధులు గౌరవంగా జీవించాలి అని మహిళలు భద్రంగా ఉండాలి అని యువతకు సరైన మార్గదర్శనం ఉండాలి. పేద కుటుంబాలకు అండగా నిలవాలని అనే ఆలోచనతోనే ప్రతిరోజు ప్రజల మధ్య ఉంటానని ఆకుల పూర్ణిమ అరుణ్ హామీ ఇచ్చారు. రాబోయే రామగుండం కార్పొరేషన్ ఎలక్షన్ లో 39 వ డివిజన్ నుండి బరిలోకి దిగుతున్నట్లు ఆకుల పూర్ణిమ అరుణ్ తెలిపారు. ప్రజల నమ్మకమే తన బలమని ప్రజల ఆశీస్సులు సహకారంతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పనిచేస్తానని ఆకుల పూర్ణిమ అరుణ్ మాటిచ్చారు.

## డ్రగ్ వద్దు.. పుస్తకాలు ముద్దు

- ఫిబ్రవరి 22న రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ లైఫ్
- వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన తుంగతుర్తి రవి




**మేడిపల్లి, విశాలభారతి:** విద్యార్థి దశలోనే డ్రగ్స్ మహమ్మారికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జీహెచ్ఎంసీ బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి అన్నారు. చదువుకోవాల్సిన వయసులో విద్యార్థులు తెలిసీ, తెలియక డ్రగ్ అలవాటు చేసుకుంటున్నారని, దీంతో తల్లిదండ్రుల అశలు, ఆశయాలను దూరం చేస్తున్నారని తెలిపారు. గురువారం ఆయన సాయిప్రియ కాలనీలోని ఆర్వీ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ లైఫ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 22న ఆదివారం నారపల్లిలోని భాగ్యనగర్ నందనవనం పార్కులో 16కే, 10కే, 5కే, 3కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. అన్నింటికన్నా ఆరోగ్యమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరుకుంటున్నట్లుగా తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రస్తుతం అనవసరంగా ఆస్పత్రుల్లో చేరి అడ్డగోలుగా డబ్బును ఖర్చుచేయొద్దని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సహితం డ్రగ్ మహమ్మారిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శాంతివనం రన్నర్స్ నిర్వాహకులు డాక్టర్ కట్ట శేఖర్, మహేందర్ రెడ్డి, సోమశేఖర్, నర్సింహానాయక్, జర్నలిస్టులు గోడిశాల సోమయ్య, రాజపేట నవీన్ చారి, జీఎం కిషోర్, ఉదయ్, వెంకట్, శ్రీనివాస్త, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు నిర్వహించిన రెవెన్యూ అధికారులు

**కీసర,విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రంలో భూ భారతి భూ సర్వే లో భాగంగా భూ రీ సర్వే నిర్వహిస్తుంది.ఈ భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 373 గ్రామాలల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదలు పెట్టింది.కావున గురువారం కీసర మండల కేంద్రంలోని యాదగిరిపల్లి గ్రామంలో కీసర తహాశీల్దార్ పెద్ది రెడ్డి యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి భూ రీ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కీసర ఆర్డీఓ ఎస్ రాజేష్ కుమార్.ఈ సంధర్భంగా ఆర్డీఓ రాజేష్ కుమార్ మాట్లాడుతూ అప్పట్లో 1940 లో జరిగిన భూ సర్వే తప్ప ఇప్పటి వరకు మళ్ళీ రాష్ట్రంలో భూ సర్వే కాలేదు అని అన్నారు.కావున మళ్ళీ ఇప్పుడు రాష్ట్రంలో భూ రీ సర్వే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది అని ఈ సందర్భంగా తెలిపారు.అసలు రెవెన్యూ చట్టాల ప్రకారం ప్రతి ముప్పై ఏండ్లకు ఒక్కసారి ఈ భూ రీ సర్వే చేయాలి అని చట్టంలో ఉందన్నారు.అసలు ఈ భూ రీ సర్వే ముఖ్య ఉద్దేశం గ్రామ సరి హద్దులు మొదట సర్వే చేస్తాం పిదప గ్రామంలోని ప్రభుత్వ భూములు సర్వే చేయడం జరుగుతుందన్నారు.ఎన్నో ఏండ్ల నుండి కొన్ని గ్రామాలకు మ్యాప్ లేదు కావున ఇప్పుడు అలాంటి గ్రామాలకు మ్యాప్ లేదు అనే సమస్య లేకుండా పరిష్కారం అవుతుంది అని అన్నారు.కావున రైతులు అందరూ భూ రీ సర్వే చేయడానికి వచ్చిన సర్వే అధికారులకు సహకరించి ప్రతి రైతు భూ ఆధార్ పొందాలి అని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కీసర సర్వేయర్ వినయ్ కృష్ణ,అర్ ఐ లు మహేందర్,విశ్వనాథ్,గ్రామ పాలన అధికారి మమత,మాజీ ప్రజా ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.





## అట్టహాసంగా మన శంకరవరప్రసాద్ గారు

# సెలబ్రేషన్స్..

## నయనతార హాజరు అవుతుందా?

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎన్నాళ్లుగానో మంచి మెగా హిట్ కోసం ఎదురు చూస్తున్న క్రమంలో 'మన శంకరవర ప్రసాద్ గారు' రూపంలో సరైన సమాధానం దొరికింది. చిరు స్టామినాకు తగ్గ సినిమా రావడం లేదని, వింటేజ్ చిరంజీవిని మళ్లీ వెండితెరపై చూడాలనే ఆశ ఫ్యాన్స్‌లో బలంగా ఉండేది. ఆ ఆశను నిజం చేస్తూ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంక్రాంతి బరిలోకి దిగి అంచనాలను మించి ఘనవిజయం సాధించింది. కుటుంబ ప్రేక్షకులు, యువత మాత్రమే కాదు... సీనియర్ ఫ్యాన్స్ నుంచి జూనియర్ ఫ్యాన్స్ వరకూ అందరినీ ఆకట్టుకునేలా ఈ సినిమా మెగా హిట్‌గా నిలిచింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, కేవలం తెలుగు మార్కెట్‌లోనే ఇంత భారీ స్థాయిలో రాణించిన సినిమాల్లో ఒకటిగా 'మన శంకరవర ప్రసాద్ గారు' ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.సంక్రాంతి సెలవులు ముగిసిన తర్వాత కూడా థియేటర్లలో నిలకడగా వసూళ్లు రావడం యూనిట్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ విజయాన్ని మరింత ఘనంగా సెలబ్రేట్ చేసుకునేందుకు నిర్మాతలు భారీ స్థాయి విజయోత్సవ వేడుకకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ వేడుకకు సంబంధించి దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టాలని తన టీమ్‌కు సూచించినట్లు టాక్. ప్రస్తుతం చిరంజీవి దుబాయ్‌లో ఉన్నప్పటికీ, ఆయన హైదరాబాద్‌కు తిరిగివచ్చిన వెంటనే ఈ ఈవెంట్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఈ వేడుకను ఓ గ్రాండ్ లెవెల్‌లో చేయాలని యూనిట్ భావిస్తోంది. సినిమాలో పని చేసిన టెక్నీషియన్లు, నటీనటులు అందరూ ఈ వేడుకకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.